

- 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మార్పులు, చేర్పులకూ అవకాశం
- అర్హులందరికీ న్యాయం జరిగేలా ప్రక్రియ

కొత్త కార్డులొస్తున్నాయ్!

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రేషన్ పంపిణీని ఓ ప్రహసనంగా మార్చేసిన ఘనత గత ప్రభుత్వానిది కాగా.. అర్హులకు రేషన్ కార్డులు అందించే విషయంలో కాలయాపనే తప్ప వారి ఎదురుచూపులు ఫలించలేదు. ఈ పరిస్థితుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడానికి కూటమి ప్రభుత్వం సమాయత్తమైంది. కొత్తగా రేషన్‌కార్డు కావాల్సిన వారు, రేషన్ కార్డుల్లో మార్పుల కోసం ఎదురుచూస్తున్న వారు ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. వచ్చే నెల 2 నుంచి ప్రక్రియ ప్రారంభించి నెలాఖరు కల్లా పూర్తి చేసి వచ్చే ఏడాది సంక్రాంతికి కొత్త కార్డులను లబ్ధిదారులకు అందించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

ఎంతోమందిని అనర్హులుగా...

వైసీపీ ప్రభుత్వం కొలువుదీరగానే గ్రామాల్లో ఉన్న రాజకీయ కారణాలతో చాలా మందిని బియ్యం కార్డుకు దూరం చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా దాదాపు 7,000 మంది వరకు ఐదేళ్లపాటు తమ కార్డును తిరిగి పునరుద్ధరించుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి వేసారి పోయారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న కార్డును రద్దు చేయడంతో వివిధ సంక్షేమ పథకాలకు లబ్ధిదారులు ఐదేళ్లపాటు దూరంగా ఉండిపోవాల్సివచ్చింది. వివాహంతో పాటు ఇతరత్రా కారణాలతో కార్డుల విభజన చేసుకోవాలనుకున్న వారి వేదనను గత పాలకులు ఆలకించలేదు. దీంతో ఐదేళ్లపాటు చేర్పులు, మార్పులకు కూడా అవకాశమివ్వకుండా పాలన సాగించారు. ఈ ఇబ్బందులన్నింటికీ చెకొపెట్టేలా కూటమి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. దీంతో అర్హతఉండీ సంక్షేమానికి దూరంగా ఉండిపోయిన కుటుంబాల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రస్తుత కార్డులు 4,86,000

జిల్లాలో ప్రస్తుతం 1123 రేషన్‌షాపుల పరిధిలో 4,86,000 రేషన్‌కార్డులు ఉన్నాయి. అంత్యోదయ కార్డుల సంఖ్య 11,100గా ఉంది. కూటమి ప్రభుత్వం వీరందరికీ కొత్త డిజైన్లతో రేషన్‌కార్డులను సంక్రాంతికి అందించే విధంగా ప్రణాళికలు రచించింది. ఓ అంచనా ప్రకారం జిల్లా వ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డుల కోసం 24,000 దరఖాస్తులు దాదాపు మూడేళ్లపాటు మోక్షానికి నోచుకోకుండా ఉండిపోయాయని సమాచారం. ఇలాంటి వారంతా ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే డిసెంబరు చివరికల్లా ఆ సమస్యను పరిష్కరించి కొత్త కార్డులు అందించే ఏర్పాటును ప్రభుత్వం చేపట్టింది. గత ప్రభుత్వంలో ఇబ్బడిముబ్బడిగా అనర్హులను లబ్ధిదారుల జాబితాలో చేర్చినట్లు ఇప్పటికే అధికారులు గుర్తించారు. వచ్చేనెల నుంచి జరిగే ప్రక్రియలో భాగంగా అనర్హుల ఏరివేత కూడా జరగనుంది. అర్హులైన ఏఒక్కరికీ అన్యాయం జరగకూడదని కొత్తకార్డుల ప్రక్రియను పూర్తిచేయడానికి ప్రభుత్వం సంకల్పించింది.

రేషన్ తీసుకోని వారికెందుకు....

గతంలో వరుసగా మూడు నెలల పాటు రేషన్ తీసుకోని కార్డులపై కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 15 శాతం కార్డులకు సంబంధించిన లబ్ధిదారులు రేషన్ తీసుకోవడం లేదనే అంచనాకు యంత్రాంగం వచ్చింది. ఇటువంటి కార్డులను రద్దు చేసి మరింత మందికి లబ్ధి చేకూర్చాలనే ఆలోచన కూడా ప్రభుత్వం చేస్తోంది.

రీచార్జి చేస్తేనే సెల్‌ఫోన్ పని చేస్తుంది.. లేదంటే ఎవరికైనా ఫోన్ చేయాలంటే కుదరదు.. ఇదే తరహాలో ఇక విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పుడు విద్యుత్ కనెక్షన్లకు ఉన్న మీటర్లను మార్చేస్తున్నారు. వాటి స్థానంలో స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో స్మార్ట్‌మీటర్లను బిగించేశారు. వ్యాపార దుకాణాల్లో మీటర్లను మారుస్తున్నారు. ఆ తర్వాత పరిశ్రమలు, గృహాలకు మార్చనున్నట్లు సమాచారం. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను జూలై 2025 లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా ఉంది. వ్యవసాయ మోటార్లకు మాత్రం స్మార్ట్‌మీటర్ల నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈ విధానంలో ఇక విద్యుత్ బకాయిలు పేరుకుపోవు.. ముందుగా చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా అయ్యే పరిస్థితులు రానున్నాయి.



మొబైల్ అనుసంధానం

స్మార్ట్ మీటర్లకు వినియోగదారుడి మొబైల్‌ను అనుసంధానం చేస్తారు. వినియోగదారుడు తన మొబైల్‌లో ఎస్పీడీసీఎల్ రూపొందించే యాప్ డౌన్‌లోడు చేసుకోవాలి. ఈ యాప్ ద్వారా ఎంత మొత్తం కావాలంటే అంత నగదు రీచార్జి చేసుకోవాలి. ఎన్ని యూనిట్లు వినియోగం జరిగింది.. ఎంత రీచార్జి చేశారు.. ఎప్పుడు రీచార్జి గడువు ముగిస్తుంది.. వంటి సమగ్ర వివరాలు మొబైల్‌లోనే తెలుసుకోవచ్చు. రీచార్జి గడువు ముగిసే సమాచారం వినియోగదారుడి సెల్ నెంబర్‌కు సంక్షిప్త సమాచారం వస్తుంది.

కరెంట్‌కూ.. రీచార్జ్

- ముందుగా నగదు చెల్లిస్తేనే సరఫరా
- విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వేగవంతం
- ఇప్పటికే వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తి
- వ్యాపార దుకాణాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న వైనం
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 36,777 మీటర్ల ఏర్పాటు
- అన్ని కేటగిరీలకు తప్పనిసరి.. వ్యవసాయ మోటార్లకు మినహాయింపు
- జూలై 2025 లోపు స్మార్ట్ మీటర్ల బిగింపు పూర్తి చేయాలని లక్ష్యం


నరసరావుపేటలోని టీ స్టాల్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

విద్యుత్ వినియోగంలో ఇక సాంకేతికత రానున్నది. మొబైల్ రీచార్జి తరహాలోనే విద్యుత్ సరఫరా వినియోగంలోకి రానున్నది. ఇందులో భాగంగా కేటగిరీల వారీగా స్మార్ట్‌మీటర్లను బిగిస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వ్యవసాయ మీటర్లు మినహా అన్ని కేటగిరి సర్వీసులకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు విద్యుత్ శాఖ చర్యలు తీసుకుంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఇప్పటికే 36,777 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మీటర్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. వ్యాపార షాపుల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు శరవేగంగా జరుగుతోంది. మరో 15 రోజుల్లో వ్యాపార దుకాణాల్లో మీటర్ల ఏర్పాటు పూర్తి కానున్నది. తదుపరి దశలో పరిశ్రమల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 200 యూనిట్లు వినియోగంపై ఉన్న గృహ సర్వీసులకు, వాణిజ్య.. పరిశ్రమల సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఈ విధానంలో ఇంటికి రీడింగ్ బిల్లు రావడం.. దానిని కట్టడం ఇక ఉండవు. వినియోగదారులు ఎంత మొత్తం రీచార్జి చేసుకుంటే ఆ మొత్తం అయిపోయే వరకు కరెంట్ సరఫరా ఉంటుంది. చెల్లించిన మొత్తం పూర్తయిన తర్వాత వెంటనే సరఫరా ఆగిపోకుండా కొంత సమయం వరకు వెసులుబాటు ఉంటుంది. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కార్యాలయాలకు వెళ్లి క్యూలో నిల్చొని బిల్లులు కట్టాల్సిన పని ఉండదు. తమ సెల్‌ఫోన్లో ఎస్పీడీసీఎల్ రూపొందించే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని

జిల్లా	బిగించిన మీటర్లు
పల్నాడు	10,668
గుంటూరు	15,349
బాపట్ల	10,760

(మిగతా 6వ పేజీలో..)

రాజ్యసభ రేసులో.. గల్లా జయదేవ్

- అధిష్ఠానం పరిశీలనలో మాజీ ఎంపీ పేరు
- గత ఎన్నికల్లో పోటీకి దూరమైనా పార్టీపై విధేయత



గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభలో అడుగు పెట్టాలని మాజీ ఎంపీ గల్లా జయదేవ్ ఉత్సాహ పడుతున్నారు. ఖాళీ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సీటు ఆశిస్తూ ప్రయత్నాలు చేస్తున్నారు. గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి రెండు పర్యాయాలు విజయం సాధించిన జయదేవ్ మూడో పర్యాయం బరిలో నుంచి తప్పుకున్నారు. లోక్‌సభ సభ్యుడిగా ఉండి తనకున్న వ్యాపారాల మూలంగా ప్రజలకు అందుబాటులో ఉండలేకపోతున్నాననే భావనతో పాటు అప్పటి సీఎం జగన్ వేధింపుల నేపథ్యంలో రాజకీయాలంటేనే విరక్తి చెందారు. ఈ క్రమంలో గత ఎన్నికల్లో డాక్టర్ పెమ్మసానికి పోటీ చేసే అవకాశం లభించగా ఆయన గెలుపును కాంక్షిస్తూ కుటుంబ సమేతంగా గల్లా వచ్చి ఓటు కూడా వేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన తనయుడు మంత్రి నారా లోకేశ్‌తో కూడా గతంలో లాగే సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజ్యసభలో అడుగుపెట్టాలనే ఆకాంక్షను ఆయన ఇప్పటికే చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. వివాద రహితుడు, నిజాయితీ పరుడైన జయదేవ్ అభ్యర్థిత్వాన్ని అధిష్ఠానం కూడా పరిశీలిస్తున్నట్టు సమాచారం. అయితే కూటమిలో టీడీపీతో పాటు మరో రెండు పార్టీలు ఉన్నందున అటు పార్టీ, కుల సమీకరణలు బేరీజు వేసుకుంటూ రాజ్యసభ అభ్యర్థిత్వాలపై సీఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా లావణ్య

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

కేఆర్ఆర్‌సీ(కోనేరు రంగారావు కమిటీ) విభాగానికి బాపట్ల జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఎస్.లావణ్యను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలిచ్చింది. జిల్లాలో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వేగంగా అడుగులేస్తున్న సమయంలో ఈ నియామకం జరగడం గమనార్హం. అదే విధంగా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా ఈ.మురళిని నియమిస్తూ కూడా ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వెయిటింగ్‌లో ఉన్న ఎస్.లావణ్య, ఈ.మురళిలకు జిల్లాలో పోస్టింగ్‌లు దక్కాయి.

అమ్మో.. ఫెంగల్


కొల్లూరు: క్రాప అడ్డరోడ్డు వద్ద ఆరబోసిన ధాన్యాన్ని పట్టాలు కప్పుకునేందుకు గుట్టగా చేస్తున్న రైతులు


రేపల్లె: తుఫాన్ కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో ఒడ్డుకు చేరిన బోట్లు


బాపట్ల: పిట్టలవానిపాలెం మండలంలో వరి హార్వెస్ట్ చేస్తున్న దృశ్యం


కొల్లూరు: లారీకి లోడు చేసేందుకు సిద్ధం చేసిన ధాన్యం బస్తాలు


వేమూరు: చదలవాడ వద్ద గాలులకు పడిపోయిన వరి పైరు


అమృతలూరు: రోడ్డు వెంబడి ఆరబోసిన ధాన్యం

- తుఫాన్ ప్రభావం.. రైతుల్లో ఆందోళన
- ముప్పులేదన్నా ఈదురు గాలులు.. వర్షం
- కల్లాల్లో, రోడ్లపైన ధాన్యాన్ని తరలిస్తోన్న అన్నదాతలు
- మూడో రోజూ హార్బర్‌లో ఒకటో నెంబరు ప్రమాద సూచిక
- చేతికొచ్చిన పంట నోటికందదేమోనని భయపడుతున్న రైతులు

బాపట్ల, రేపల్లె, వేమూరు, భట్టిప్రోలు, కొల్లూరు, తెనాలి, కొల్లూరు, అమృతలూరు, గుంటూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం బలపడి తీవ్ర తుఫాన్‌గా మారింది. ఫెంగల్ పేరుతో దూసుకొస్తోన్న తుఫాన్ బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలపై ప్రభావం చూప దని అధికారులు ప్రకటిస్తున్నారు. అయితే బాపట్ల జిల్లా పరిధిలోని తీరప్రాంతంలో అలలు చిన్నపాటి స్థాయిలో పైకి వస్తున్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దన్న హెచ్చరికలతో పడవలన్నీ ఒడ్డునే ఉన్నాయి. బాపట్ల, గుంటూరు జిల్లా ల్లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆకాశం మేఘా వృతమైంది. తుఫాన్ ప్రభావంతో చలిగాలులు పగటి వేళల్లో కూడా ఎక్కువగా వీస్తున్నాయి. ఇక బాపట్ల జిల్లాలోని తీర ప్రాంతంతో పాటు గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు పడ్డాయి. కోతకోసి ఆరబోసి రోడ్లపై, కల్లాల్లో ఉంచిన ధాన్యాన్ని వర్షం తడిపేసింది. రెండు రోజులుగా వాతావరణం ఎండ, మబ్బులతో దోబూచులాడుతున్నా వర్షం పడదన్న ధైర్యంతో రైతులు వరి కోతలు కోస్తున్న, ఇప్పటికే కోసిన వారు తుఫాన్ ప్రభావంతో వణికిపోతున్నారు. కల్లాల్లో ధాన్యం ఉన్న రైతులు వర్షంతో తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వర్షం పడదన్న భరోసాతో ఉన్న రైతులను వర్షం నష్టపరిచింది. కొందరు ధాన్యపు రాశులపై పట్టాలు కప్పేసుకోగా మరికొందరు గోతాలకెత్తి మిల్లులకు తోలేందుకు సిద్ధమయ్యారు. కోత కోయకుండా ఉంచిన పైరు గాలులకు చాలాచోట్ల నేలవాలింది. కొల్లూరు మండలంలో 8 వేల ఎకరాల్లో సాగు చేయగా 1500 ఎకరాల్లో మాత్రమే వరికోతలయ్యాయి. భట్టిప్రోలు మండలంలో పది వేల ఎకరాల వరి సాగు చేపట్టగా, రెండు రోజులుగా కేవలం 500 ఎకరాల్లో మాత్రమే రైతులు కోతలు కోశారు. రేపల్లె నియోజకవర్గంలో 1.20 లక్షల ఎకరాలపైనే వరి సాగు చెయ్యగా 10 వేల ఎకరాల్లో కోతలయ్యాయి. బాపట్ల, కర్లపాలెం, పిట్టవానిపాలెం మండలాల్లో 53వేల ఎకరాల్లో వరిసాగవగా 30శాతం పైర్లు కోతకు సిద్ధంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో చిరుజల్లులతో పంట నేలవాలి గింజ కూడా దక్కదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వాతావరణ శాఖ మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడుతుందని హెచ్చరికలు జారి చేయడంతో అన్నదాతలు భయాందోళనలకు గురవుతున్నారు. గతంలో వచ్చిన వరదల వల్ల ఒకసారి నష్టపోయామని ఇప్పుడు వర్షాలు పడితే సాంతం మునగడం ఖాయమని రైతులు వాపోతున్నారు. తుఫాన్ కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో మూడో రోజైన శుక్రవారం ఒకటో నెంబరు ప్రమాదసూచిక కొనసాగుతుంది. సముద్రం కల్లోలంగా ఉండటంతో భయాందోళనతో వారం క్రితం వేటకు వెళ్ళిన బోట్లన్నీ సురక్షితంగా హార్బర్‌కు చేరుకున్నాయి.

యంత్రాలకు డిమాండ్


ముసురు నేపథ్యంలో నూర్పిడి యంత్రాలకు డిమాండ్ పెరిగింది. గతంలో ఎకరాకు తీసుకునే మొత్తం కంటే ఎకాఎకిన రూ.800వరకు పెంచి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వర్షం పడితే మొత్తానికే నష్టపోతామనే బెంగతో రైతులు భారమవుతున్నా సరే లెక్క చేయకుండా కోతలు కోయిస్తున్నారు. వాతావరణ పరిస్థితి దృష్టిలో ఉంచుకుని చేతికి వచ్చిన పంటను కాపాడుకునేందుకు యంత్రాలతో రాత్రివేళల్లో సైతం పంటను కోత కోయించి ధాన్యాన్ని కొందరు భద్రపరుస్తున్నారు. రేపల్లె నియోజకవర్గంలో మధ్యాహ్నం నుంచి ఈదురుగాలులతో కూడిన వర్షంపడటంతో పైర్లు నేలవాలాయి. చెదురుమదురు గాలులతో నేలవాలిన పైర్లను కట్టులు కట్టేపనిలో రైతులు నిమగ్నమయ్యారు.

వరి కోయవద్దు


తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నందున రెండు, మూడు రోజుల పాటు వరి కోతలు కోయకుండా ఉండటం మంచిదని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. కోత కోసిన తర్వాత వర్షం కురిస్తే ధాన్యం పాడయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు కోత కోసిన ధాన్యం చాలా వరకు అమ్మకాలు జరిగాయన్నారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సీఎం సహాయనిధికి
రూ.10 లక్షల విరాళం
చంద్రబాబుకు అందజేసిన పెదగాదెలవర్రుకు చెందిన కల్నల్ డాక్టర్ కేపీరావు
6
అయ్యప్ప స్వాములకి
ఆర్టీసీ టూర్ ప్యాకేజీలు

శబరిమల యాత్రతోపాటు ఇతర క్షేత్రాలకు ప్రతిపాదనలు

నేటి నుంచి
వీరారాధన ఉత్సవాలు
కారంపూడిలో ముస్తాబైన ఆలయాలు
8

ముస్తాబు చేస్తున్న ధ్వజస్తంభం

ఎలర్జీలపై నేడు, రేపు జాతీయ సదస్సు


డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్

మంగళగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చినకాకాని ఎన్నారై మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో శని, ఆదివారాల్లో ఎలర్జీలపై జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ జరుగుతుందని సదస్సు కన్వీనర్ డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్ తెలిపారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పిల్లల వైద్యుల సమాఖ్య ఆధ్వర్యంలో రెండు రోజులపాటు సదస్సు జరుగుతుందన్నారు. మారుతున్న వాతావరణం, పెరుగుతున్న కాలుష్యం కారణంగా దేశంలో ఎంతో మంది ఎలర్జీలు, సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారని చెప్పారు. పిల్లలకు సంబంధించిన ఎలర్జీలపై నూతన వ్యాధి నిర్ధారణ పరిశోధనలు, పరీక్షలు, చికిత్సా విధానాల మీద సదస్సులో చర్చిస్తామన్నారు. జాతీయ పిల్లల ఎలర్జీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమోహన్ నాయక్, జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణరెడ్డి, కోశాధికారి ధనేష్ వాల్వేకర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

వాకా అంజిరెడ్డికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న వాకా అంజిరెడ్డి

గుంటూరు(విద్య), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అస్సాంలోని సిల్ చార్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పరిశోధన చేసినందుకు గుంటూరుకు చెందిన వాకా అంజిరెడ్డికి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. డాక్టర్ బాదల్ సోని పరిశోధన పర్యవేక్షణలో 'డీప్ లెర్నింగ్ ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్ కనుగొనడం' అనే అంశంపై అంజిరెడ్డి పరిశోధన చేశారు. 22వ స్నాతకోత్సవంలో అంజిరెడ్డికి డాక్టర్ రెడ్డి పట్టాను అందించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, పరిశోధకులు, బంధువులు అంజిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రస్తుతం డాక్టర్ అంజిరెడ్డి వాకా లెండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, విజయనగరంలో ప్రొఫెసర్, పరిశోధన, అభివృద్ధి విభాగంలో మెంబర్‌గా పని చేస్తున్నారు.

స్టెప్ సీఈవోగా చంద్రముని

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్టెప్ సీఈవోగా చంద్రముని రంగాలని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలానే డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ రంగయ్యని పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ విభాగంలో నియమించింది. ఎక్సైజ్‌లో అసిస్టెంట్ సెక్రెటరీ(సర్వీసెస్) హోదాలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ పెంచల ప్రభాకర్‌ని ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎస్‌డీసీ(అడ్మిన్)గా నియమిస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అయ్యప్ప స్వాములకి ఆర్టీసీ టూర్ ప్యాకేజీలు

- శబరిమల యాత్రతోపాటు ఇతర క్షేత్రాలకు ప్రతిపాదనలు

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాములకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీలతో సిద్ధమైంది. అయ్యప్ప స్వాములకు స్పెషల్ సర్వీసులను ఏర్పాటు చేసి అదనపు ఆదాయం కోసం టూర్ ప్యాకేజీలతో అందుబాటులో ఉంచుతున్నారు. శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాములు ఒక బృందంగా చేరి 30 మంది స్వాములు ఉంటే వారికి ప్రత్యేక బస్సు సిద్ధం చేస్తామని గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. డిపో నుంచి పది కిలో మీటర్ల దూరంలో ఎక్కడికైనా బస్సును అయ్యప్పస్వాముల వద్దకు పంపిచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మంచి కండిషన్‌లో ఉన్న బస్సుతోపాటు సుశిక్షితులైన డ్రైవర్‌లను యాత్ర బస్సులకు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

గుంటూరు నుంచి బయల్దేరి..

శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాములకు ప్రత్యేక టూర్ ప్యాకేజీలను సిద్ధం చేస్తున్నారు. గుంటూరు నుంచి బయల్దేరి నేరుగా కాణిపాకం, అరుణాచలం, పళని, ఈషా టెంపుల్, గురు వాయర్, ఎరుమేలి, పంబ, సన్నిధానం అనంతరం తిరుగు పయనంలో త్రివేండ్రమ్, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, తిరుచంధుర్, శ్రీరంగం, శివకంచి, విష్ణు కంచి, శ్రీకాళహస్తి మొదలైన పుణ్య క్షేత్రాలను దర్శించుకుని గుంటూరు చేరుకుంటుంది. అయ్యప్ప స్వాముల కోరిక మేరకు సూపర్ లగ్జరీ (2+2)పుష్ బ్యాక్, అల్ట్రా డీలక్స్ బస్సులు అందుబాటులో ఉంచుతున్నారు. స్వాముల కోరినటువంటి క్షేత్రాలకు బస్సులు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్యాకేజీ ధరలు

అయ్యప్ప స్వాములకు టూర్‌కు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు ఏడు రోజుల టూర్‌కు ప్యాకేజీ బస్సుకు రూ. 2,49,000 కాగా 10 రోజుల టూర్ ప్యాకేజీ రూ. 2,85,000, 12 రోజుల టూర్‌కి రూ. 3,34,000, అలానే అల్ట్రా డీలక్స్ బస్సుకి ఏడు రోజుల టూర్‌కి రూ.2,65,000, అదే పది రోజుల టూర్‌కి రూ. 3,0,2000 కాగా 12 రోజుల టూర్‌కి రూ.3,55,000 తెలిపారు.

తీవ్ర నేరాలకు పాల్పడే వారిని కట్టడి చేయండి

- తరచూ నేరాలకు పాల్పడే 10 మంది జాబితాను రూపొందించండి
- రాత్రి గస్తీ సమయంలో అనుమానితుల వివరాలు సేకరించండి
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్


జిల్లా నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తీవ్ర నేరాలకు పాల్పడే వారిని కట్టడి చేసే బాధ్యత డీఎస్పీలదేనని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన అక్టోబరు నెల నేర సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు పలు అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మహిళలు, పిల్లలు, తీవ్ర నేరాలు, వ్యక్తుల అదృశ్యం, ఆధారాలు తెలియని మరణాలు, రోడ్డు ప్రమాదాల కేసులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. 'మహిళా.. మీ కోసం' కార్యక్రమం ద్వారా మహిళలు, ఆడ పిల్లల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టులో కేసులకు సంబంధించి త్వరగా ఛార్జిషీట్, పెండింగు దస్త్రాల దాఖలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో తరచూ నేరాలకు పాల్పడే 10 మంది నిందితుల జాబితాను రూపొందించి వారి కార్యకలాపాలను పర్యవేక్షిస్తుండాలన్నారు. రాత్రి గస్తీ సమయంలో అనుమానితుల వివరాల సేకరించాలన్నారు. అన్ని ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా సాధ్యమైనన్ని కేసులు పరిష్కరించాలన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేయడంతోపాటు నిందితులకు శిక్షలు వేయించడంలో చొరవ చూపాలన్నారు. ఛార్జిషీట్లు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పోక్సో, రేప్ కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా చేయాలని అన్నారు. మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసుల్లో అలసత్వం వహించవద్దన్నారు. చోరీ కేసుల్లో నిందితులను పట్టుకుని ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలని చెప్పారు. సఖి (వన్ స్టాప్ సెంటర్ ఫర్ ఉమెన్ ప్రొటెక్షన్) న్యాయవాది విజయలక్ష్మి సఖి తరుపున మహిళలకు అందించే సేవలను వివరించారు.

రివార్డులు, ప్రశంసాపత్రాలు

జిల్లాలో విధి నిర్వహణలో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రశంసాపత్రాలు, రివార్డులు అందించారు. వాటిని అందుకున్న వారిలో తెనాలి డీఎస్పీ జనార్దన్ రావు, , సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు, మహిళా పీఎస్ డీఎస్పీ సుబ్బారావు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, నగరంపాలెం సీఐ వీరా నాయక్, చేబ్రోలు ఎస్సై వెంకటకృష్ణ, తెనాలి రూరల్ ఎస్సై ప్రతాప్ కుమార్, కొల్లిపర ఎస్సై కోటేశ్వరరావు, ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కుమార్, పట్టాభిపురం స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుళ్ల ఫణిరాజు, నాగేశ్వరరావు, నల్లపాడు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ వీర్ల అంకయ్య తదితరులు ఉన్నారు. స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుళ్ల ఇచ్చిన సమాచారంతో గంజాయి ముఠాలను అదుపులోకి తీసుకున్నందుకుగానూ వారిని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా అదనపు ఎస్పీలు రమణమూర్తి, రవిబాబు, హనుమంతు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్‌కూ.. రీచార్జి

(5 పేజీ తరువాయి)

అందులో తమ సర్వీసు నంబరును నమోదు చేసుకుని కట్టవచ్చు. ఎప్పటికప్పుడు యాప్ ద్వారా తమకున్న విద్యుత్ సర్వీసుకు రీచార్జి చేసుకునే సౌకర్యం ఉంటుంది. దీనివల్ల అపరాధ రుసుం చెల్లించే పరిస్థితి ఉండదు. మీటర్ రీడింగ్ తీసే సమయంలో తప్పులు దొర్లే పరిస్థితి ఉండదు. స్మార్ట్ మీటర్‌లో ఏర్పాటు చేసిన ఇన్ బిల్ట్ సిమ్ ద్వారా ఎప్పటికప్పుడు మీటర్‌లో రికార్డు అయ్యే మొత్తం సమాచారం ఆన్‌లైన్ ద్వారా చూసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో మూడు జిల్లాల్లో లక్షల మేర మీటర్ల ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. వ్యవసాయం మినహా అన్ని కేటగిరి సర్వీసులకు మీటర్లు బిగింపు తప్పని సరి చేస్తున్నారు.

వినియోగదారులకు అవగాహన

విద్యుత్ వినియోగం 200 యూనిట్లకుపైగా ఉన్న గృహ వినియోగదారులందరికీ స్మార్ట్ మీటర్లను బిగించనున్నారు. వ్యాపార, వాణిజ్య, పరిశ్రమలకు పూర్తయిన వెంటనే గృహాలకు మీటర్ల బిగింపునకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. మీటర్ల బిగింపు పూర్తయితే వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. స్మార్ట్ మీటర్ల వల్ల నష్టాలు.. అధిక బిల్లు తదితరాలపై వినియోగదారులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వచ్చే జూలై నుంచి స్మార్ట్ మీటర్లు వినియోగంలోకి రానున్నాయి. అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న విధానంలోనే విద్యుత్ బిల్లులు చెల్లించాలని అధికారులు తెలిపారు. స్మార్ట్ మీటర్ బిగించినా దానిని యాక్టివేట్ చేయలేదని చెబుతున్నారు. మీటర్ల ఏర్పాటు పూర్తయిన వెనువెంటనే రీచార్జి విధానం అమల్లోకి రానున్నది.

విద్యుత్ చోరీకి చెక్

విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ద్వారా విద్యుత్ చౌర్యం కూడా తెలిసిపోతుంది. ఎక్కడ విద్యుత్‌చౌర్యం జరుగుతుందో గుర్తించే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. 11 కేవీ, 33 కేవీ ఫీడర్లు, అధిక సామర్థ్యం గత నియంత్రికల వద్ద స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం వల్ల ఎంత విద్యుత్ సరఫరా అవుతోంది, వినియోగం, వృథా ఎంత వంటి వివరాలు ఆయా మీటర్లలో ఉన్న సిమ్‌లలో నమోదవుతుంది. ఫీడర్ నియంత్రికలపై హెచ్చు, తగ్గుల సరఫరా అవుతున్నా యాప్‌లో నమోదు అవుతుంది.

మిర్చియార్డులో కాటాదారుల పరేడ్


మిర్చియార్డులో వేమెన్‌ల పరేడ్‌లో సెక్రెటరీ ఆంజనేయులు

గుంటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కాటాదారు(వేమెన్)ల పరేడ్‌ని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ ఆదేశాల మేరకు శుక్రవారం యార్డు పరిపాలన భవనంలో సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులు ఈ తనిఖీని నిర్వహించారు. మొత్తం 108 మంది కాటాదారులకు 86 మంది హాజరయ్యారు. మిగతా 22 మంది వేర్వేరు కారణాలను పేర్కొంటూ గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా సెక్రెటరీ ఆంజనేయులు మాట్లాడుతూ సోమవారం నుంచి కాటాదారులంతా నిర్ణీత సమయానికి డ్రస్‌కోడ్, ఐడీ కార్డులు ధరించి హాజరు కావాలన్నారు. ఎవరి పేరు మీద అయితే లైసెన్సు ఉందో వాళ్లే విధులకు హాజరై కాటాలు వేసి చీటీలు ఇవ్వాలని స్పష్టం చేశారు. తాము ప్రతి ఒక్క లైసెన్స్‌ని తనిఖీ చేస్తామని, నిబంధనలకు విరుద్ధంగా లైసెన్సుదారు స్థానంలో వేరే వాళ్లు ఉంటే వాటిని రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎవరైతే గైర్హాజరయ్యారో వారంతా సోమవారం యార్డు పరిపాలన భవనానికి రావాలని ఆదేశించారు. ఈనామ్ పద్ధతిలో ట్రేడింగ్ జరిగిన మిరపకాయలను కాటా వేయాలన్నారు.

ఆటోని సీజ్ చేసి రూ. 6 వేలు పెనాల్టీ వేశాం

మిర్చియార్డులో సుమారు 50 టిక్కీలను జీరో బిజినెస్‌లో బయటకు తరలించాలని ఒక వ్యాపారి ప్రయత్నించగా అతనికి తొలి హెచ్చరిక జారీ చేసి రూ. 6 వేలు పెనాల్టీ వేశామని సెక్రెటరీ తెలిపారు. మరోసారి జీరో బిజినెస్‌కు పాల్పడితే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. సమావేశంలో ఇతర అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమర్థుడైన మన్నవకు.. సరైన పదవి

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- అట్టహాసంగా ఏపీటీఎస్ చైర్మన్‌గా మోహనకృష్ణ పదవీ బాధ్యతల స్వీకరణ



సభలో మాట్లాడుతున్న పెమ్మసాని, పక్కన మన్నవ మోహనకృష్ణ

గుంటూరు(తూర్పు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో మన్నవ మోహనకృష్ణ సమర్థతను చంద్రబాబు నాయుడు, లోకేశ్ గుర్తించి సరైన కీలక పదవిని అప్పగించారని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రింగురోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్(ఏపీటీఎస్) చైర్మన్‌గా మన్నవ మోహనకృష్ణ బాధ్యతల స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యాభ్యాసం నుంచి అమెరికా ప్రయాణం వరకు మన్నవ మోహనకృష్ణ జీవితం యువతకు స్ఫూర్తిని చేసేలా ఉంటుందన్నారు. గత పదేళ్లగా ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి మన్నవ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆలోచనలతో సాంకేతికతలో రాష్ట్రం పురోగమిస్తుందని అన్నారు. ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ కీలకమైన పదవి అప్పజెప్పిన చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు నాయుడు తొలి జాబితాలో ఉంటారని, ఆయన అడుగుజాడల్లో నడుస్తానని అన్నారు. వచ్చే ఐదేళ్లలో టెక్నాలజీ రంగంలో 20 లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పిన నారా లోకేశ్ ఆలోచనలను ముందుకు తీసుకువెళ్తానని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అభిమానులు, కూటమి కార్యకర్తలు సందడి చేశారు.

భారీగా హాజరైన ప్రజా ప్రతినిధులు

కార్యక్రమానికి భారీగా ప్రజా ప్రతినిధులు హాజరైయ్యారు. ఎమ్మెల్యేలు చదలవాడ అరవింద బాబు, ప్రత్తిపాటి పుల్లారావు, వేగ్నేశ నరేంద్ర వర్మ, జూలకంటి బ్రహ్మారెడ్డి, నక్కా ఆనందబాబు, బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, యార్లగడ్డ వెంకటరావు, ఏపీఐడీసీ, మాదిగ, విభిన్న ప్రతిభావంతుల, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ల చైర్మన్‌లు డేగల ప్రభాకర్, ఉండవల్లి శ్రీదేవి, గోనుగుంట్ల కోటేశ్వరరావు, పట్టాభిరామ్, కూటమి నాయకులు నిమ్మల శేషయ్య కనపర్తి శ్రీనివాసరావు, బోనబోయిన శ్రీనివాస్, వేముల కొండ శ్రీనివాస్, అబ్బూరి మల్లి, మన్నవకు అభినందనలు తెలిపారు.

సీఎం సహాయనిధికి రూ.10 లక్షల విరాళం


ముఖ్యమంత్రికి చెక్కు అందిస్తున్న కల్నల్ డాక్టర్ కేపీరావు, సూర్యకుమారి

చుండూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెదగాదెలవర్రుకు చెందిన కల్నల్ డాక్టర్ కేపీరావు, ఎన్నారై గుత్తికొండ సూర్యకుమారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.10 లక్షల విరాళంగా చెక్కును అందించారు. పెదగాదెలవర్రులో కల్నల్ డాక్టర్ కేపీ రావు 1960లో ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశారు. ఆర్మీలో ఉన్నత ర్యాంకులో పని చేస్తూ డిప్యుటేషన్‌పై డీఆర్‌డీఏ శాస్త్రవేత్తగా 1982-88 వరకు మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాంతో కలిసి పని చేశారు. 1995లో మిలటరీ విభాగపు ఆర్‌అండ్‌డీ విభాగంలో శాస్త్రవేత్తగా అనేక నూతన ఆవిష్కరణలు చేశారు. ఓ కుగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని దేశం గర్వించదగిన స్థాయికి చేరిన కల్నల్ డాక్టర్ కేపీరావుకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపి సత్కరించారు. స్వగ్రామానికి సేవలందించినందుకుగానూ ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు, మాజీ సర్పంచి ప్రభావాణి, రాహుల్ సాంకృత్యాయిన్, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

సీఐడీతో విచారణ జరిపించాలని సీఎంను కోరతా

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ ఒప్పందాలకు సంబంధించి వెలుగుచూసిన అవినీతి ఆరోపణలపై సీఐడీతో విచారణ జరిపించాలని ముఖ్యమంత్రిని కోరతామని ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌర విద్యుత్ పేరిట వేల కోట్ల రూపాయల దోపిడీ జరిగిందని ఆరోపించారు. ఇందులో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అడ్డంగా దొరికిపోయారని విమర్శించారు. నిజాన్ని నిగ్గుతేల్చి దోషులకు శిక్ష పడాలంటే సరైన దర్యాప్తు జరగాలని అన్నారు. అధికారం చేతుల్లో ఉంది కదా అని కేంద్ర విద్యుత్ చట్టాన్ని తుంగలోకి తొక్కి బిడ్డింగ్ రూల్స్‌కు విరుద్ధంగా బరితెగించి దోపిడీకి పాల్పడ్డారన్నారు. సౌర ఒప్పందాల్లో అతని గ్యాంగ్ ఏతప్పు చేయకుంటే వారి అవినీతిపై అమెరికాలో కేసు ఎందుకు పెడతారని సూటిగా ప్రశ్నించారు. నాటి రాష్ట్ర విద్యుత్ మంత్రికే తెలియకుండా అర్ధరాత్రి ఒప్పందం ఎందుకు చేసుకోవాల్సి వచ్చిందో జగన్ సమాధానం చెప్పాలన్నారు. వచ్చిన ప్రతిపాదనలపై ఒక్కరోజులోనే కేబినెట్‌లో ఎలా ఆమోదం పొందారని, ఏం చర్చించారనే విషయాలు కూడా ప్రజలకు వివరించాలన్నారు.

ఉపాధ్యాయుడు మద్యం తాగి విధులకు హాజరు


హెచ్‌ఎం దుర్గాభవానితో మాట్లాడుతున్న గిరిజన నేతలు

మాచర్ల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం తాళ్లపల్లి పంచాయతీ ఏడోమైలు గ్రామంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలలో సుమారు 450 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ఈ పాఠశాల వివాదాలకు కేరాఫ్‌గా మారింది. ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయుడు వై.వెంకటేశ్వర్లు మద్యం తాగి విధులకు వస్తున్నారనీ, ఈ విషయంపై ప్రశ్నించిన తోటి ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసరావుపై చేయి చేసుకున్నాడనీ, మహిళా టీచర్లు, విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలను టీడీపీ గిరిజన నేత రెడ్యానాయక్, కోఆప్టెడ్ సభ్యుడు బి.వెంకటేశ్వర్లు నాయక్ శుక్రవారం పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలపై ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకున్నారు. ఈ విషయాలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు దృష్టికి తీసుకెళ్తామని విద్యార్థినులకు హామీ ఇచ్చారు. బాలికల పాఠశాలలో మహిళా టీచర్లు మాత్రమే విధులు నిర్వహించాలని జీవో ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గిరిజన నేతలు పేర్కొన్నారు.

డిప్యుటేషన్‌పై బదిలీ

మద్యం తాగి పాఠశాలకు రావడం, తోటి ఉపాధ్యాయుడిపై చేయి చేసుకోవడం వంటి సంఘటనలపై డీటీడబ్ల్యూవోకు సమాచారం ఇచ్చినట్లు పాఠశాల హెచ్‌ఎం దుర్గా భవాని చెప్పారు. దీంతో ఉపాధ్యాయుడు వై.వెంకటేశ్వర్లును డిప్యుటేషన్‌పై హనుమాపురం తండాకు బదిలీ చేసినట్లు తెలిపారు.

కోర్టులో లొంగిపోయిన వైసీపీ నేత మన్నెయ్య


మన్నెయ్య (ఫైల్)

దుర్గి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన వైసీపీ నేత ఊరిబిండి మన్నెయ్య శుక్రవారం మాచర్ల పట్టణంలోని అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో లొంగిపోయాడు. జడ్జి శ్రీనివాస కల్యాణ్ అతనికి 14 రోజులు రిమాండ్ విధించారు. దుర్గి పోలీసులు మన్నెయ్యను గురజాల సబ్‌జైలుకు తరలించారు. ఈ ఏడాది మే 8న ఎన్నికల సమయంలో జంగమహేశ్వరపాడులో పోలీసులు నాటుబాంబులు, వేట కొడవళ్లను గుర్తించారు. కాగా జూలై 7న అదే గ్రామంలో నాటుబాంబు పేలడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి పోలీసులు అప్పట్లో పలువురిని అదుపులోకి తీసుకుని విచారించారు. మన్నెయ్యను ప్రధాన నిందితునిగా గుర్తించి కేసు నమోదు చేశారు. కాగా అప్పటికే మన్నెయ్య అజ్ఞాతంలోకి వెళ్లాడు. అయితే శుక్రవారం మాచర్ల కోర్టులో లొంగిపోవడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం

గుంటూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాలలపై జరిగే దోపిడీ, హింస, వేధింపులకు కారణమయ్యే వివాహాలు, లైంగిక నేరాలు, అక్రమ రవాణా మొదలగు అంశాలను క్షేత్రస్థాయిలో అరికట్టి వారి హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా స్థాయి కిశోరి వికాసం శిక్షకుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఎం.ఉమాదేవి అధ్యక్షత వహించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114,122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

46,683 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 40,183 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 46,683 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 32,927 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	15000	334	7500	15800
నెంబరు. 5	8500	12000	నెంబరు.5	8000	9500
273	11000	11800	273	10500	14000
341	8000	13500	341	7500	14500
4884	12000	12000	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	8800	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500	తేజ	7500	16500
బ్యాడిగి	8000	14500	బ్యాడిగి	8000	14500
దేవనూరు డీలక్స్	9000	14000	దేవనూరు డీలక్స్	10000	10000
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	4200	10000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నేటి పెన్షన్ పంపిణీలో పార్టీ నాయకులు పాల్గొనాలి

● బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 1వ తేదీ ఆదివారం కావటంతో ఒకరోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేయటంతో శనివారం పంపిణీ చేసే పెన్షన్‌ల కార్యక్రమంలో అధికార యంత్రాంగంతోపాటు తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీనాయకులు కూడా పాల్గొనాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలోని వార్డు ప్రెసిడెంట్‌లు, పంచాయతీ ప్రెసిడెంట్‌లు ఉదయం 6 గంటలు నుంచే పెన్షన్‌లు పంపిణీ చేసి ఆ చిత్రాలను పార్టీ కార్యాలయాలకు, సోషల్‌మీడియాలో పోస్ట్‌లు చేయాలని పిలుపునిచ్చారు.

● పిట్టలవానిపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 14 గ్రామపంచాయతీలలో ప్రతినెల పెన్షన్‌దారులకు పంపిణీ చేసే పెన్షన్‌లను డిసెంబరు 1వ తేదిన ఆదివారం కావటంతో నవంబరు 30వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేయాలని పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి ఐ.సత్యనారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పెన్షన్‌దారులకు ఉదయం 6 గంటలు నుంచే సంబంధిత సమయంలో అందజేయాలని ఎంపీడీవో తెలిపారు.

నేడు జ్వాలదీపోత్సవ కార్యక్రమం

బాపట్ల,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీమత్సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత శ్రీక్షీర భావన్నారాయణస్వామి దేవాలయంలో కార్తీక ఐశ్వర్య జ్వాలదీపోత్సవ కార్యక్రమం శనివారం సాయంత్రం 4 గంటలకు నుంచి నిర్వహించటం జరుగుతుందని బి.బాబునాగేంద్ర, వెల్లంపల్లి సత్యనారాయణ తెలిపారు. జ్వాలదీపోత్సవానికి సంబంధించిన పోస్టర్‌లను శుక్రవారం ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం సాయంత్రం నుంచి మంగళవాయిద్యాలు, వేదపారాయణం, శ్రీశ్రీశ్రీ శివస్వామివారి ఆశీస్సులు, జ్వాలతోరణపూజ, కార్తీక ఐశ్వర్య జ్వాలదీపోత్సవం, ఉమామహేశ్వరుల పల్లకిసేవ, శాంతిమంత్రం, ప్రసాదవితరణ జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమరౌతు నాగభూషణం, బెల్లంకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై జరుగుతున్న అరాచకాలను అరికట్టాలి

పిట్టలవానిపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా మహిళలు, చిన్నారులపై అనేక లైంగిక దాడులు జరగటం నిత్యకృత్యమైందని సామాజిక మాద్యమాలలో చూస్తున్నామని దాన్ని అరికట్టాలని ఖాజీపాలెం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.రాధ అన్నారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీప్రియ మాట్లాడుతూ బాల్య వివాహాలు అనుకొని పరిస్థితులలో వారి తల్లిదండ్రులు వల్ల జరుగుతుంటే 1098 అనే హెల్ప్‌లైన్‌నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. సంబంధిత శాఖ వారు బాల్య వివాహం జరగకుండా నివారించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు లీలావతి, అలేఖ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరాంజనేయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కళ్యాణి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌సెంటర్‌ను పరిశీలించిన ఎంపీడీవో

కర్లపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : యాజలి సచివాలయంలో జరుగుతున్న ఆధార్ సెంటర్‌ను ఎంపడీవో అద్దూరి శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆధార్‌సెంటర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఐనంపూడి శ్రీనివాసరావు, కార్యదర్శి వీరాస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఎం జిల్లా ప్రథమ మహాసభ

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎంఎస్‌ఆర్ కల్యాణ మండపంలో శని, ఆదివారాలలో సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య తెలిపారు. ఈ మహాసభలకు పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ సభలలో అనేక తీర్మానాలు చేయటం జరుగుతుందన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

బాపట్ల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం స్టూవర్టుపురం గ్రామంలో జి.విష్ణు అనే వ్యక్తి తన ఇంటి పక్కనే ఉన్న సుధాకర్‌కు చెందిన గృహం నుండి పశువులు తన నివాసంలోకి వచ్చి నాశనం చేస్తున్నాయని ఫిర్యాదుదారుడు విష్ణు వెదుళ్ళపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారు. దీంతో సుధాకర్ కొంత మంది వ్యక్తులతో కలిసి విష్ణుపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో విష్ణుకు తీవ్రగాయాలవ్వటంతో బాపట్ల ఏరియా వైద్యశాలకు వెళ్ళి చికిత్స చేయించుకున్నాడు. ఈమేరకు విష్ణు ఇచ్చిన ఫిర్యాదుమేరకు వెదుళ్ళపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల దినోత్సవం ఘనంగా జరపాలి


బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జనసేన పార్టీ దివ్యాంగుల నాయకుడు గోగన ఆదిశేషు కోరారు. పట్టణంలోని 1వ వార్డు బేతనీకాలనీలో శుక్రవారం దివ్యాంగ సేవాసమితి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆదిశేషు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ డిసెంబరు 3వ తేదీన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఉంది కావున కూటమి నాయకులు దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్‌ను ప్రకటించి వేడుకలు జరుపుకునే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో నటరాజు, సుందరరావు, పి.బాలసుందర్, సుందరరావు, పి.వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, రాఘవులు, జవహర్‌లాల్, సామ్రాజ్యం, రవణమ్మ, బి.ఆదిశేషు, పి.చెంచమ్మ పాల్గొన్నారు.

శిథిల భవనంలోనే విధులు

● పనిచేయని వాటర్‌ప్లాంట్..పట్టించుకోని అధికారులు

● నాడు-నేడు పనులు నిరుపయోగం

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎంతో ఘనచరిత్ర కలిగిన బాపట్ల మున్సిపల్ హైస్కూల్ భవన సముదాయం శిథిలావస్థకు చేరుకుంటున్నది. అయినప్పటికీ అందులోనే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఈ భవనం పరిస్థితిని గమనించిన టీడీపీ నాయకులు నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తభవనం నిర్మాణం పూర్తి చేయకుండా నాడు-నేడు కింద రూ.78.57 లక్షలు మంజూరు చేసి పాతభవనాన్నే మరమ్మతులు చేశారు. దీని కోసం సుమారు రూ.53.17 లక్షలు ఖర్చు చేసి మిగిలిన డబ్బులు వినియోగించకుండా వదిలేశారు. కేవలం తరగతి గదులలో బెంచీలు, టీవీలు, భవానికి రంగులు వంటి పనులు మాత్రమే చేశారు. తాగునీటి సౌకర్యం కోసం వాటర్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో ప్లాంట్ వినియోగించకపోవటం వల్ల పని చేయకుండా పోయింది. దీంతో కొంతమంది ప్లాంట్‌లోని ట్యాప్‌లు, ఇతర సామగ్రి అపహరించారు. ఫలితంగా పనిచేయని ప్లాంట్ వెక్కిరిస్తూ కనిపిస్తున్నది. పాఠశాలలో 6నుంచి 10వ తరగతి వరకు 912మంది విద్యార్థులు ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్నారు. వర్షం వస్తే పాతభవనం నీరు కారుతుంది. స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయపడుతున్నారు. కావున దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. డిసెంబరు 7వ తేదిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రానున్నారు. ఆయన రాకతోనైన పాఠశాలకు వసతులు మెరుగుపడుతాయని ఎదురుచూస్తున్నారు.



మున్సిపల్ హైస్కూల్ స్లాబ్ పెచ్చులూడి పడుతున్న చిత్రం



విద్యార్థులు తాగేందుకు తీసుకొచ్చిన వాటర్‌క్యాన్‌లు



నాడు-నేడు కింద ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా ఉన్న చిత్రం

బీసీల అభ్యున్నతికి అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలి

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



మాట్లాడుతున్న ఈడీ వెంకటేశ్వరరావు, బీసీ సంఘం నాయకులు

బాపట్ల,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బీసీల అభ్యున్నతికి కేటాయించిన నిధులను అర్హులైన వారికి రాయితీ రుణాలను మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాయితీ రుణాలపై అన్ని కుల సంఘ నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రకాశం, బాపట్ల జిల్లాల బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ బీసీ సామాజికవర్గంలోని అన్ని కులాలకు రాయితీ రుణాలను ఇవ్వటానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. 2875 మందికి పైగా రాయితీ రుణాలను మంజూరు చేయటానికి రూ.47.60 కోట్లు ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. 52 రకాల యూనిట్‌ల ఏర్పాటుకు నివేదిక రూపొందించామన్నారు. బీసీల అభ్యున్నతికి నూతన యూనిట్‌ల ఏర్పాటుకు కులాల వారిగా సూచనలు, సలహాలను వారు సేకరించారు. 2025 జనవరి 15లోపు రాయితీ రుణాలు పొందటానికి దరఖాస్తులను చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తులు చేసుకుంటే త్వరితన నిధులు కేటాయిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, కార్యదర్శి మారం రవికుమార్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయాలి

బాపట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : హిందూ దేవాలయాల రక్షణ కోసం జనవరి 5వ తేదీన విజయవాడలో హైందవ శంఖారావం సభను నిర్వహిస్తుండగా ఆ సభను విజయవంత చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల సంయోజక్ శ్రీనివాసుల శ్రీనివాస్ అన్నారు. జిల్లా సమావేశాన్ని శుక్రవారం బాపట్ల శ్రీరామానుజకూటంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మరక్షణ కోసం, హిందూ దేవాలయాల రక్షణ కోసం, హిందువుల ఐక్యత కోసం విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావ సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. డిసెంబరు 11వ తేదీ శౌర్యదివస్‌గా గీతాజయంతి జరుపుకోవాలి, 14వ తేదీ రెండో శనివారం సత్సంగాలు నిర్వహించాలన్నారు. డిసెంబరు 16 నుంచి ధనుర్మాసం మేలుకొలుపులు జరుపుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా మహిళా కన్వీనర్ బొలగాని విజయలక్ష్మి, మెదడుగు సూరిబాబు, చింతల మురళీకృష్ణ, అక్కల సుబ్బారెడ్డి, హేమశంకరరావు, దండుప్రోలు వెంకట్రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాష్ట్రీయ బాల ఆరోగ్య స్ర్కీనింగ్ క్యాంపు : ఎంపీడీవో

కర్లపాలెం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులలో అనారోగ్య సమస్యలను తొలిగించి ఆరోగ్యవంతులుగా చేయడమే రాష్ట్రీయ బాల ఆరోగ్య స్ర్కీనింగ్ క్యాంపు ముఖ్య ఉద్దేశ్యమని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. యాజలి జడ్పీ హైస్కూల్ పీహెచ్‌సీ వారు నిర్వహించిన రాష్ట్రీయ బాల ఆరోగ్య స్ర్కీనింగ్ క్యాంపును శుక్రవారం ఎంపీడీవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఎత్తు, బరువు, పుట్టుకతో ఏమైన సమస్యలు ఉన్నాయా అని పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కర్లపాలెం ప్రభుత్వ పాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు, సిబ్బంది అందించే వైద్య సేవలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఆరోగ్యసిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

వ్యాయామంతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు

చెరుకుపల్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యలో రాణిస్తూ ఆరోగ్యంపై దృష్టిసారించి వ్యాయామం తప్పనిసరిగా చేయాలని ప్రాంతీయ వ్యాయామ విద్యాసంచాలకులు ఎస్‌కే మహబూబ్ భాషా అన్నారు. శుక్రవారం చెరుకుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులను ఆటల్లో ఎలా ప్రోత్సహించాలని సూచనలు, సలహాలు ఇవ్వటం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాటూరి లక్ష్మీనారాయణ, బాపట్ల జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎస్‌కే కరిముల్లా, పాల్గొన్నారు.

నగరం పల్లెల్లో పరిశ్రమలపై ప్రోత్సాహం

నగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే దిశగా ఇంటింటా సర్వే కార్యక్రమం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నవంబరు 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు సర్వే నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. నిరుద్యోగ యువతకు జీవనోపాధి కల్పించటమే ఈసర్వే ముఖ్యలక్ష్యమని అన్నారు. దీంతోపాటుగా డిసెంబరు 1వ తేదీ ఆదివారం కావటంతో నవంబరు 30వ తేదీన ఎన్టీఆర్ ఫించన్ భరోసా అర్హులందరికి ఒక్కరోజులోనే నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను కోరారు. సచివాలయ, రెవెన్యూ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

సంఘీయుల అభ్యున్నతికి కృషి చేయాలి

రేపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పద్మశాలీయ సంఘీయుల్లో వెనుకబడిన, ఆర్థిక స్తోమత లేనివారికి అండగా నిలిచి వారి అభ్యున్నతికి కృషి చేయాలని డాక్టర్ ఏవీ సుబ్బారావు అన్నారు. పాతపట్నంలోని రాచూరు జమిందార్‌కోటలో పద్మశాలీయ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్, పద్మశాలీయుల సంఘీయుల కార్తీక వనసమారాధన శుక్రవారం నిర్వహించారు. సామూహిక సత్యన్నారాయణస్వామి వ్రతాలు చేశారు. ప్రముఖ వైద్యులు ఏవీ సుబ్బారావు మాట్లాడుతూ కార్తీక వనసమారాధన ద్వారా అందరూ ఒక్కచోట చేరి ఆప్యాయతల అనురాగాలను పెంచేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం సీనియర్ ఉద్యోగులను సన్మానించారు. వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణం రామ్మోహన్‌రావు, జీవీ నాగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, జే.నాగరాజు,మునగాల నాగేశ్వరరావు, ఎ.రామచంద్రరావు, కె.నాంచారావు, మునగాల నాగమల్లేశ్వరరావు, వై.సంజీవయ్య, పి.సాంబశివరావు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధన అధ్యాత్మిక చింతన, మానసిక ఉల్లాసం, సోదరభావం పెంపొందుతుందని ఎస్ఎస్ఈ న్యూస్ ఛానల్ ఎండీ సుఖవాసి సతీష్‌బాబు అన్నారు. నగరం మండలం ఏలేటిపాలెం గార్డెన్స్‌లో నియోజకవర్గంలోని కేబుల్ ఎంఎస్‌వోలు, సిబ్బందితో కార్తీక వన భోజనాలను నిర్వహించారు. కేబుల్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

విద్యతో పాటు వివిధ కళల్లో రాణించాలి

రేపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యలో రాణిస్తూ అటు క్రీడారంగం, వివిధ కళల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఏబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీసీ రవిచంద్రకుమార్ అన్నారు. రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఆదేశాలతో ప్రపంచ ఎయిడ్స్ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతి విద్యార్థి అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.వెంకటేశ్వరరావు, వీవీ రవీంద్ర, బాలగురవయ్య పాల్గొన్నారు.

నగరం మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు



ధూళిపూడిలో ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వుతున్న చిత్రం

నగరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మట్టి మాఫియా నగరం మండలంలోని కొలగానివారిపాలెం, ధూళిపూడి పరిసర ప్రాంతాల్లో తవ్వకాలు నిర్వహిస్తుంది. వివరాల్లోకి వెళ్ళితే... వ్యవసాయ భూములను ఇష్టానుసారంగా తవ్వకాలను చేపట్టి మట్టి అక్రమ వ్యాపారం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో తవ్వకాలు జరిపి తమ జేబులను నింపుకుంటున్నారు. పక్కనే ఉన్న తమ పంట పొలాలు దెబ్బతింటాయని ఈ తవ్వకాలపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి వాటిని వెంటనే నిలుపుదల చేయాలని, ఈ అక్రమ మట్టి మాఫియాను నివారించాలని ప్రజలు వేడుకుంటున్నారు. దీనిపై తహసీల్దార్ జీ.నాంచారయ్యను వివరణ కోరగా మండల పరిధిలో ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని వివరించారు. అంతేకాకుండా వెంటనే స్పందించి ఆ సంఘటన స్థలానికి వీఆర్‌వోలను పంపించి అక్రమ మట్టి తవ్వకాలను నిలుపుదల చేశారు. మండల పరిధిలో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఉద్యోగాలు పొందినవారు అత్యున్నత స్థానాలకు ఎదగాలి



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ గాయత్రి

వేమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్‌మేళాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించడం అభినందనీయమని వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గాయత్రి అన్నారు. కళాశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ప్రముఖ కంపెనీలు మెడ్‌ప్లస్ ఫార్మసీ, ఏకెఆర్ ప్రైవేట్ లిమిటెడ్, కెఎల్ గ్రూపు సంస్థలు నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్‌మేళా నిర్వహించారు. 34 మంది హాజరు కాగా వారిలో 18 మంది కంపెనీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారితో నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ఉద్యోగాలకు ఎంపికైన వారు అనుభవాన్ని బట్టి అత్యుత్తమైన స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రణయ్, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్స్ రవికుమార్, హరీష్, జెఆర్‌పి అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపార్చన



విజయలక్ష్మీపురంలో శ్రీ లక్ష్మీ సత్యనారాయణస్వామి దేవస్థానంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న భక్తులు

బాపట్ల,నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయలక్ష్మీపురంలో ఉన్న శ్రీ లక్ష్మీ సత్యనారాయణస్వామి దేవస్థానంలో శుక్రవారం కార్తీక దీపార్చన వైభవంగా జరిగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బాపట్ల ఎస్ఎన్‌పీ అగ్రహారంలో ఉన్న శ్రీ గంగా పర్వత వర్ధని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకమాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం భక్తులు కార్తీక దీపోత్సవం నిర్వహించారు. జ్యోతిర్లింగ నటరాజ, పద్మ, ఓంకార, నందీశ్వర డమరుకశూల స్వరూపంలో దీపాలను భక్తులు వెలిగించి పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రసాద్‌స్వామి చిట్టిబాబు కౌండిన్య, సాయి వెంకట్, నెమలి కంటి హనుమంతరావు, ఆలయ ధర్మకర్తలు హరినారాయణ భక్తులు పాల్గొన్నారు.

● కొల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమం శుక్రవారం రాత్రి నిర్వహించారు. కొల్లూరులోని అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో లలితా మండలి వారి ఆధ్వర్యంలో కార్తీక మాస శివరాత్రి పురస్కరించుకుని శివలింగాకృతి రూపొందించి సహస్ర దీపాలంకరణ చేశారు. శివలింగాకృతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఆలయ అర్చకులు నిర్వహించారు.

అమృతలూరు, నవంబరు (ఆంధ్రజ్యోతి)29 : కార్తీక మాసం మాస శివరాత్రి పురస్కరించుకొని శైవ క్షేత్రాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూచిపూడి శ్రీరామలింగేశ్వరస్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. మండల కేంద్రం అమృతలూరులోని శ్రీఅమృతేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలతోపాటు అన్నాభిషేకం జరిపారు. సాయంత్రం నందీశ్వరునికి, స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.

● చుండూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : చిన పరిమిలోని శ్రీగంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామికి శుక్రవారం మహా శివరాత్రి సందర్భంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రవార అభిషేకం, 111 కేజీల అన్నాభిషేకం జరిగింది. ఈ పూజాది కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. సాయంత్రం దేవాలయంలో అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.



అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో శివలింగాకృతి రూపొందించిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో కూచిపూడి శ్రీ రామలింగేశ్వరస్వామి



చినపరిమిలో స్వామి వారికి చేసిన అన్నాభిషేకం

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వేమూరు గ్రామానికి చెందిన బలగాని శ్రీనివాసరావు అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. చికిత్సకు అయిన ఖర్చును ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పించి సహకరించాలని ఆయన ఎమ్మెల్యే ఆనందబాబుకు విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే సిఫారసు మేరకు రూ.20,166 చెక్కును శుక్రవారం లబ్ధిదారునికి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. లబ్ధిదారుడు శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

● కొల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శుక్రవారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని చినపులివర్రుకు చెందిన గుర్రం మాధవిలక్ష్మికి రూ.1,09,660, పోతార్లంక గ్రామానికి చెందిన చిరుమామిళ్ల కాశేశ్వరరావుకు రూ.40 వేలు, ఈపూరు కు చెందిన కనపర్తి ప్రసన్నకుమారికి రూ.35 వేలు వంతున అందిన చెక్కులను ఎమ్మెల్యే గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు.

సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలి

రేపల్లె, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తలు, నాయకులు తప్పనిసరిగా సభ్యత్వ నమోదు తీసుకోవాలని తద్వారా రూ.5 లక్షల జీవితబీమా వర్తిస్తుందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిజాంపట్నం టీడీపీ మండల అధ్యక్షులు ఓగిబోయిన వెంకట్‌యాదవ్ టీడీపీశాశ్వత సభ్యత్వం కోసం రూ.లక్ష కట్టి సభ్యత్వం నమోదు చేసుకున్నారు. సభ్యత్వ నమోదు పత్రాన్ని అనగానిశివప్రసాద్‌కు అందించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 35 వేల సభ్యత్వాలు ఇప్పటివరకు జరిగాయని కొన్ని పంచాయతీల్లో మందకొడిగా సాగుతున్నాయని ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పంతాని మురళీధరరావు, రేపల్లె నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు కొలసాని రాము, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, బొర్రా సూర్యరాజు, తొట్టెంపూడి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



వెంకట్‌యాదవ్‌కు టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని అందిస్తున్న అనగానిశివప్రసాద్

చిలుమూరులో శ్రీనివాస కల్యాణం, పడిపూజా మహోత్సవం

● హాజరైన సినీ కవి జొన్నవిత్తుల

కొల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : శ్రీనివాస కల్యాణం, పడి పూజా మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం మండల పరిధిలోని చిలుమూరు ఉభయ రామలింగేశ్వర క్షేత్రం, వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం గణపతి హోమం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, శ్రీదేవి, భూదేవి సమేత కలియుగ వరదునికి వసంతోత్సవం, శ్రీనివాస కల్యాణ మహోత్సవం తదితర కార్యక్రమాలను తిరుమలలో జరిగే పాంచారాత్ర ఆగమం విధానంలో నిర్వహించారు. సాయంత్రం పడి పూజా మహోత్సవాన్ని కేరళ సాంప్రదాయ పద్ధతిలో శబరిమల ప్రధాన ఆలయ ఉపఅర్చకులు మురళీధరన్ నంబూద్రి పూలాభిషేకం, మహానివేదన, పడిపాట, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, రిటైర్డ్ డీజీపీ ఎవి సుబ్బారావు, గంగు విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ జె.శ్రీనివాసరావు, ఎఆర్ఎం ప్రభాకర్, వివిధ గ్రామాల నుంచి అయ్యప్ప స్వామి మాలదారులు పూజల్లో పాల్గొన్నారు. పూజాది కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త హరి దుర్గానాగేశ్వరరావు, శబరి యాత్ర మిత్ర మండలి సభ్యులు పర్యవేక్షించారు.



పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న సినీ కవి జొన్నవిత్తుల

బాల్య వివాహాలను నివారించాలి


● సీడీపీవో విజయలక్ష్మి


కొల్లూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహలను నిర్మూలించాలని అమృతలూరు ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెసర్లంక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అనంతవరం సెక్టార్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన సీడీపీవో గ్రామంలోని తల్లిదండ్రులతో బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనార్థాలు, అనారోగ్య సమస్యలు గురించి వివరించారు. 18 ఏళ్ల నిండిన తరువాతే వివాహాలు జరిపించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యకర్తలు కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా సరఫరా అయ్యే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏసీడీపీవో విజయరాణి, సూపర్‌వైజర్ నగరాజకుమారి, ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ శివనాగమణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్నాడులో జైనం ఉనికి

పల్నాటి గడ్డ.. పగ, ప్రతీకారాలకు, పల్నాటి వీరుల పౌరుష పరాక్రమాలకే కాదు.. ఒకప్పుడు శాంతి, అహింసను బోధించి అనుసరించిన గొప్ప జ్ఞానభూమి కూడా. ఎందుకంటే, పల్నాడులో జైన మతం భాసిల్లిందని చెప్పడానికిఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. మాచర్ల పట్టణంలో జైనమతం ఉనికిని తెలిపే విగ్రహాలు గుర్తింపులోకి వచ్చాయి.

- తీర్థంకరుల విగ్రహాలు
- పాతమాచర్లలో పార్శ్వనాథుడు విగ్రహం
- నాగబుద్ధుని శివాలయంలో సుపార్శ్వనాథుడు





మాచర్లటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాత మాచర్లలోని వీరశైవ మతానికి చెందిన కంభాలమఠం వారి సమాధుల దొడ్డిలో సమాధుల మధ్యలో ఉన్న జైన తీర్థంకరులలో ఒకరైన 23వ తీర్థంకరుడు పార్శ్వనాథుడు విగ్రహం ఉంది. నాలుగు అడుగుల ఎత్తులో ఉన్న ఈ నల్లరాతి విగ్రహంపై అద్భుతమైన శిల్పకళ ఉంది. ఏడు పడగల నాగుపాము పడగ నీడలో దిగంబరుడిగా, కాయత్సర్గ భంగిమ (నిలబడి)లో ఉన్న పార్శ్వనాథుడు ధ్యానము ద్రలో ఉన్నారు. ఆపైన మూడు పొరల (త్రిస్తర) ఛత్రాలు ఉన్నాయి. పాదాల వద్ద యక్ష, యక్షణీయులు ఉన్నారు. ఈ తీరు శిల్పాన్ని చౌనీసి విగ్రహం అంటారు. ఈ చిత్రాలన్నీ అందంగా చెక్కబడి ఉన్నాయి.



కంభాలమఠం సమాధుల దొడ్డిలో పార్శ్వనాథుని విగ్రహం

పోతురాజుగా పూజలందుకుంటున్న తీర్థంకరుడు

పాత మాచర్ల నాగిరెడ్డి బజారులోని పోలేరమ్మ దేవాలయం చాలా పురాతనమైంది. ఈ ఆలయంలో క్రీస్తు శకం 1313 నాటి కాకతీయ దాన శాసనం ఉంది. ఈ దేవాలయం గర్భగుడి ఎదురు ఒక రాతిపై నాలుగు వైపులా కాయత్సర్గ భంగిమలో దిగంబరంగా ఉన్న తీర్థంకరుడి చిత్రాలు చెక్కబడి ఉన్నాయి. ఈ తీర్థంకరుడి విగ్రహాన్ని స్థానికులు పోతురాజుగా బావించి పూజలు చేస్తున్నారు. అయితే, ఈ విగ్రహం పోతురాజుది కాదు. జైన తీర్థంకరులలో ఒకరిది. అక్కడ జైన పాదాల ముద్రలు కూడా ఉన్నాయి.

జైనం.. ప్రస్థానం

క్రీస్తు పూర్వం ఆరో శతాబ్దంలో జైనమతం పుట్టింది. జీనడు అంటే అన్నింటిని జయించిన వాడు అని అర్థం. మతాన్ని ప్రచారం చేసే వారిని తీర్థంకరులు (మార్గదర్శకులు, శాస్త్రము నిర్మించిన వాడు) అని అంటారు. కళింగ రాజు అయిన ఖరవేలుడి ఆదరణ వలన కృష్ణా నదికి ఉత్తర తీర ప్రాంతాల్లో ముందంజ వేసింది. అశోకుడి పుత్రుడు సంప్రతి ఆంధ్ర, ద్రవిడ దేశాల్లో జైనం వ్యాప్తికి కృషి చేశారు. అమరావతి సమీపంలోని వడ్డమాను కొండపై సంప్రతి విహారం ఏర్పడింది. అక్కడ ఖరవేలుడు మహామేఘ వాహన విహారం నిర్మించాడని తెలుస్తోంది. చంద్రగుప్తులు, శాతవాహన కాలంలో ఈ ప్రాంతంలో జైన మత ప్రచారం జరిగినట్లు పరిశోధకుల అభిప్రాయం. ఆ తరువాత రాష్ట్రకూటులు, చాళుక్యులు, కాకతీయ గణపతి దేవుని వరకు జైనమతం ఉందని తెలుస్తోంది. అనంతరం వీరశైవం, వీర వైష్ణవం కారణంగా కొన్ని జైనాలయాలు ధ్వంసం చేయబడి వాటిని శివాలయాలుగా, వైష్ణవాలయాలుగా మార్చి వేయడం జరిగింది. అలాగే, పల్నాడు ప్రాంతంలో మాచర్లలోని క్రీస్తుశకం 641వ సంవత్సరం శాసనం ప్రకారం, మరికొన్ని శాసనాల్లో 'పల్లినాటి', 'పల్లినాంటి వీరుడు' అని ఉందని, 'పల్లి' అంటే జైన బసదులని, ఆ కాలంలో జైన, బౌద్ధ ఆరామాలు ఎక్కువగా ఉండడం వలన పల్లినాడు అన్నారని చరిత్ర కారుల భావన.

నాగమయ్య కాదు సుపార్శ్వనాథుడు

మాచర్ల రింగు రోడ్డు నుంచి సాగర్ రహదారిలో ప్రభుత్వ కళాశాలకు వెళ్లే రహదారికి ఎదురుగా ఉన్న నాగబుద్ధుని శివాలయంలో పూజలందుకుంటున్న నాగమయ్య (నాగబుద్ధుడు) జైన తీర్థంకరులలో ఏడో తీర్థంకరులైన సుపార్శ్వనాథుడు. దేవాలయంలో మూడు రాతి స్తంభాలు ఉన్నాయి. వాటిలో ఐదు పడగల నాగుపాము నీడలో కాయత్సర్గ భంగిమలో ఉన్న సుపార్శ్వనాథుడి చిత్రాలు చెక్కబడి ఉన్నాయి. రెండు రాతి స్తంభాలపై ముందుభాగంలో, మధ్య స్తంభం ముందు, వెనుక భాగాల్లో ఈ చిత్రాలు ఉన్నాయి.

జైన బసది..

మాచర్ల మున్సిపల్ రిజర్వాయర్ పక్కన ఉన్న ఎస్సీ హాస్టల్ ఆవరణలో శిథిల కట్టడం జైన బసది. అయితే, ప్రస్తుతం దానిని బాగు చేయించి శివాలయంగా మార్చారు. పన్నెండళ్ల క్రితం శిథిలావస్థలో ఈ జైన బసది ఉండేది. దీనిలో కొందరు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపి ధ్వంసం చేశారు. 2015లో దీన్ని బాగు చేయించి శివాలయంగా మార్చారు. జైనులు ధ్యానం చేసుకోవడానికి జైన బసదులు ఉపయోగించే వారు.



చెన్నకేశవ ఆలయం జైనాలయమా?

ప్రసిద్ధ మాచర్ల చెన్నకేశవస్వామి ఆలయం పూర్వం జైనుల లయం కావొచ్చని పలువురు పరిశోధకుల అభిప్రాయం. 12వ శతాబ్ధంలో శివాలయం చెన్నకేశవ ఆలయంగా మార్పుబడిందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ దేవాలయం ముందు పెట్టిన బోర్డులో ఉంది. అయితే, జైనాలయం శివాలయంగా మారి ఆ తర్వాత చెన్నకేశవ ఆలయంగా మార్పు చెంది ఉండవచ్చని పలువురు చరిత్రకారుల అభిప్రాయం. అయితే, దీనిని నిరూపించే ఆధారాలు మాత్రం లేవు.



పోలేరమ్మ దేవాలయంలో తీర్థంకరుడి విగ్రహం

పార్శ్వనాథుని విగ్రహాన్ని పరిరక్షించాలి

మాచర్ల పట్టణంలో బయటపడిన ఈ జైన విగ్రహాలు శాసనాలు లేనందున ఏ కాలం నాటివో చెప్పడం కష్టం. వీటిని పురావస్తు శిలాతత్వ శాఖ వారు పరీక్షించి కాలం నిర్ణయించాల్సిందే. పార్శ్వనాథుని విగ్రహాన్ని ప్రభుత్వం పరిరక్షించాలి. జైన మతానికి సంబంధించిన ఇక్కడి అపురూప విగ్రహలను పరిరక్షించడానికి పురావస్తు శాఖ దృష్టి సారించాలి.

ఎస్సీ మహిళల పరిశ్రమలకు
రూ.50 వేలు రాయితీ

- రూ. 1.64 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- డిసెంబరు 2 వరకు దరఖాస్తుకు అవకాశం
- డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మీ



గుంటూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఎస్సీ మహిళలకు ఉన్నతి పథకం కింద స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం ఆర్థికంగా చేయూత నిస్తున్నట్లు డీ డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మీ వెల్లడించారు. ఎస్సీ మహిళలు ఏర్పాటు చేసుకునే సూక్ష్మ, మధ్యతరహా యూనిట్లకు ప్రభుత్వం రూ.50 వేల వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. రూ. లక్ష నుంచి రూ. 3 లక్షల వరకు రుణాలు పొందిన మహిళలకు ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. జిల్లాలో మొత్తం 20868 డ్వాక్రా సంఘాలు ఉండగా, వారిలో ఎస్సీ సంఘాలు 6,556 ఉన్నాయని తెలిపారు. జిల్లాకు మొదటి విడతగా 82 యూనిట్లకు గాను రూ.1.64 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, డ్వాక్రా సంఘాల్లో ని 18- 60 ఏళ్లలోపు వయస్సు ఉన్న ఎస్సీ మహిళలకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు వెల్లడించారు. రాయితీ కోసం డిసెంబరు 2న ఐదు గంటల లోపు స్థానిక వెలుగు కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని పీడీ విజయలక్ష్మీ సూచించారు.

నేటి నుంచి రాష్ట్ర సదస్సు

- హాజరుకానున్న 600 మంది చర్మవ్యాధుల వైద్య నిపుణులు
- ఐఏ డీవీఎల్ రాష్ట్ర అధ్యక్షురాలు కవిత వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు, సీతారామ్, కవిత, సౌజన్య

గుంటూరు మెడికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజీ, వెనీరియాలజీ, లెప్రాలజీ (ఐఏ డీవీఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ 43వ వార్షిక వైద్య సదస్సు 'ఏపీ క్యుటికాన్ 2024' ఈ నెల30, డిసెంబర్ 1 తేదీల్లో గుంటూరులో జరుగుతున్నట్లు ఏపీ చర్మ వ్యాధుల వైద్య నిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత తెలిపారు. శుక్రవారం లక్ష్మీపురంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్‌లో గల శ్రీ కన్వెన్షన్‌లో శని, ఆదివా రాల్లో జరిగే ఈ వైద్య సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా 600 మంది వైద్యులు, పీజీ మెడికల్ విద్యార్థులు హాజరవుతున్నట్లు డాక్టర్ కవిత వివరించారు. ఐఏ డీవీఎల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్ షినాయ్ సదస్సును ప్రారంభిస్తారన్నారు. సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేపీ సీతారామ్ మాట్లాడుతూ సదస్సులో చర్మ వ్యాధులతో పాటు కుష్ఠు, లైంగిక వ్యాధులు, జుత్తు సమస్యలు, లేజర్ చికిత్సలు, సౌందర్య చర్మచికిత్సలు, బొల్లి మచ్చలు, ఇతర పిగ్మెంటేషన్ వ్యాధులకు సంబంధించిన ఆధునిక చికిత్సలపై పలువురు వైద్యనిపుణులు ప్రసంగిస్తారని తెలిపారు. సదస్సులో 12 మంది జాతీయ ఫ్యాకల్టీ, 40 మంది ఫ్యాకల్టీ ఆయా అంశాలపై ప్రసంగిస్తారన్నారు. 30 పోస్టర్ ప్రజెంటేషన్ పేపర్లు సదస్సులో ప్రదర్శిస్తామన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జే సౌజన్య మాట్లాడుతూ డిసెంబరు 1న వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఐఏ డీవీఎల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్ షినాయ్, సెక్రటరీ జనరల్ డాక్టర్ భూమేష్ కుమార్ కటకం పాల్గొంటారని తెలిపారు. విలేకర్ల సమావేశంలో కే డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ టీ మోహన్‌రావు పాల్గొన్నారు.



కలక్టరేట్ లోని ఈవీఎంల గోడౌన్ పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ

ఈవీఎంల గోడౌన్ తనిఖీ

గుంటూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మాసవారి తనిఖీలలో భాగంగా శుక్రవారం గుంటూరు కలక్టరేట్ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ పరిశీలించారు. సీసీ టీవి పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. గోడౌన్ వద్ద భద్రత సిబ్బంది లాగ్ బుక్‌ను పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలపై గడువు తేదీని ఎప్పటికప్పుడు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామంలో వ్యవసాయ మార్కెట్‌లో వీవీ పాట్స్ భద్రపరచిన గోడౌన్‌ను గుంటూరు ఆర్డీవో కే. శ్రీనివాసరావు తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేటట్లు పర్యవేక్షిస్తుండాలని భద్రతా సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్. ఖజావలి, గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఫిరంగిపురం తహసీల్దార్ జె. ప్రసాదరావు, గుంటూరు ఆర్‌అండ్‌బీ ఈ.ఈ విశ్వనాథ రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస రెడ్డి, ఎలెక్షన్ సెక్షన్ పర్యవేక్షకులు మల్లేశ్వరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా
ఆంధ్రా - ఉత్తరాఖండ్ మ్యాచ్



హనీష్ (106 పరుగులు)



మన్విత్ (55 పరుగులు)

మంగళగిరి సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆంధ్రా-ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగు రోజుల మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది. రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 76 పరుగులతో బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు 80 ఓవర్లలో 337 పరుగులు చేసి ఆలౌటయింది. ఆంధ్రా జట్టులో కే.హనీష్ వీరారెడ్డి 6 సిక్సర్లు, 11 ఫోర్లతో 106 పరుగులు, మన్విత్‌కుమార్ రెడ్డి 55 పరుగులు సాధించారు. ఉత్తరాఖండ్ బౌలర్లు రితిక్ డూహరాన్, జతిన్‌లు చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 33ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 137 పరుగులు చేసింది. ఉత్తరాఖండ్ బ్యాటర్ అరవ్ మహాజన్ 61 పరుగులు చేయగా, ఆంధ్రా బౌలర్లు ఎస్.రాజేష్, ఏఎస్‌వీ లోహిత్‌లు చెరో వికెట్ సాధించారు. ఉత్తరాఖండ్ విజయం సాధించా లంటే మరో 256 పరుగులు చేయాల్సివుంది.



అరవ్ (61 పరుగులు)

నేటి నుంచి వీరారాధనోత్సవాలు

మండల కేంద్రమైన కారంపూడిలో శనివారం నుంచి ఐదు రోజులపాటు వీరారాధన ఉత్సవాలను నిర్వహించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 14 జిల్లాల వీరాచారవంతులు తమ ఆయుధాలతో యుద్ధభూమికి రానున్నారు. మొదటి రోజైన ఈనెల 30వ తేదీన రాచగావు, డిసెంబరు 1న రాయభారం, 2న మందపోరు, 3న కోడిపోరు (ప్రధానమైనరోజు), 4న కల్లిపాడు జరపనున్నారు.





ముస్తాబైన ఆలయం



కారంపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. అంకాళమ్మ అమ్మవారు ఆలయం, ధ్వజస్తంభం, సూరేశ్వరస్వామి ఆలయాలు బ్రహ్మనాయుడు మేడ, కన్నమదాసు మేడలను రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు అటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని వసతులు సమకూర్చారు.

నేడు ఎడ్ల పోటీలు ..

వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో శనివారం తెలుగు రాష్ట్రాలస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్వయంగా ప్రారంభించనున్నారు.

అంకాళమ్మ దేవాలయం

పల్నాటి యుద్ధానికి పూర్వం కార్యమపూడి అని పిలువబడే నేటి కారంపూడిలో అంకాళమ్మ, సూరేశ్వర, చెన్నకేశవస్వామి ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు నేటికీ వీరాచారవంతులు వచ్చి కొలుపులు జరుపుతుంటారు. 12వ శతాబ్దానికి ముందు నిర్మించిన అంకాళమ్మ అమ్మవారి ఆలయంలో ఎదురుగా ఉన్న నాగులేటి ఒడ్డున పల్నాటి యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో వీరు ఒక్కొక్కరుగా నేలకొరుగుతుంటే అమ్మవారి విగ్రహం నుంచి కన్నీరు కారుతుండేదట. ఆ నీరు నేలమీద పడితే అరిష్టమని అప్పటి పూజారులు కంటి కింద ఓ గిన్నెను అమర్చారు. వీరులు మరణిస్తుంటే అమ్మవారి తల వరిగిందంట. అప్పటికీ అమ్మవారి తల ఒరిగినట్లు విగ్రహం దర్శనమిస్తోంది. అంతటి మహిమాన్విత శక్తి గల అంకాళమ్మ అమ్మవారిని భక్తులు వేలాదిగా కొలుస్తుంటారు. మాలదారణ స్వీకరించి దీక్ష చేపట్టి వీరారాధన ఉత్సవాల్లో కోడి పోరు రోజున ఇరుముడులు సమర్పించి దీక్ష విరమిస్తారు. వీరాచారవంతు కత్తి సేవ చేసి అమ్మవారికి కొలుపులు జరుపుతారు. ఇప్పటికీ ఈ ప్రాంతంలో అంకమ్మ, అంకాళమ్మ, అంకారావు అనే పేర్లు అనేక మందికి ఉంటాయి. సంతానం లేని వారు అమ్మవారిని కొలిచి ఆమె పేరు పెట్టుకుంటామని మొక్కుకుంటే సంతానం కలుగుతుందని ప్రసిద్ధి. శ్రావణమాసం రెండో శుక్రవారం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం జరపడం అనాధిగా వస్తోంది.

చెన్నకేశవస్వామి దేవాలయం

మాచర్ల రాజ్యానికి మంత్రిగా ఉన్న బ్రహ్మనాయుడు కారంపూడిలో చెన్నకేశవస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆయన కారంపూడి వచ్చినప్పుడు ఆయన మేడలో నివసిస్తూ గంగధార మడుగులో స్నానమాచరించి చెన్నకేశవస్వామిని దర్శించుకొని వెళ్లేవారట. చెన్నకేశస్వామి ఆలయంలో ముఖ మండపం ముందు ఓ బావి ఉండేది. ఆ బావిలో నీరు తాగితే ఎక్కడలేని వీరావేశం వచ్చేది. దీంతో ఆ బావిని మూసివేశారని చరిత్రకారులు తెలుపుతున్నారు. నేటికీ చెన్నకేశవుని వీరారాధన ఉత్సవాల్లో వీరాచారవంతులు పూర్వీకుల ఆయుధాలతో వచ్చి కత్తి సేవ చేసి తీర్థం పుచ్చుకుంటారు. ఆనాటి ఆలయాన్ని 2004లో దేవాదాయ శాఖ జీర్ణోద్ధరణ గావించింది.



నాగులేరు..

నాగులేరు ...

వీరుల దేవాలయ సరిహద్దుల్లో నాగులేరు ఉంది. ఈ ప్రాంతంలోనే గంగధార మడుగు ఉంది. గంగధార మడుగును శ్రీనాథ మహాకవి కాశీలోని మణికర్ణికఘాట్‌తో పోల్చారు. అందుకే వీరాచారవంతులు తమ పూర్వీకుల ఆయుధాలతో ఉత్సవాలకు వచ్చేటప్పుడు గంగధార మడుగులో స్నానమాచరించి పూజలు నిర్వహిస్తారు.



అయ్యప్ప భక్తులకు
తెలుగు వైద్యుల స్వచ్ఛంద సేవలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నరేంద్రరెడ్డి

- శబరిమల, పంబలో ఓపీ వైద్యసేవలు
- 12 వైద్య బృందాలు..60 రోజులు సేవలు
- డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి వెల్లడి

గుంటూరు మెడికల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): కేరళలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో అయ్యప్ప భక్తులకు ఉచితంగా, స్వచ్ఛందంగా వైద్యసేవలు అందించేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐఎంఏ వైద్యులు ముందుకొచ్చారు. శబరిమల, పంబలో 68 రోజుల పాటు 12 బృందాలు (ఒక్కొక్క బృందంలో ఆరుగురు వైద్యులు) స్వచ్ఛంధ వైద్యసేవలు అందించేందుకు ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు, కేరళ రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. డిసెంబరు, జనవరి మాసాల్లో వణికించే చలిలో అయ్యప్ప భక్తులు కొండపై ప్రయాణం చేయడం చేస్తుంటారు. దీంతో వేలాది మంది భక్తులు జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు, కాళ్ళ నొప్పులకు గురౌతున్నారు. గతేడాది 45 లక్షల మంది అయ్యప్ప భక్తులు శబరిమలను సందర్శించగా, వీరిలో 32 మంది భక్తులు మృతి చెందారు. వీటిని గమనించిన అయ్యప్ప భక్తులైన వైద్యులు 'డివోటీ డాక్టర్స్ ఆఫ్ శబరిమల' పేరిట సంఘంగా ఏర్పడి డిసెంబరు, జనవరిలో శబరిమల, పంబలో భక్తులకు స్వచ్ఛంధ వైద్య సేవలు అందిస్తామని కోరగా, కేరళ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 118 మంది ఐఎంఏ వైద్యులు, వారిలో తెలుగు రాష్ట్రాల నుంచి 25 మంది ఈ స్వచ్ఛంధ వైద్యసేవలో పాల్గొంటున్నారు. జనవరి 17వరకు ఈసేవలు కొనసాగుతాయి. ఈ విధుల్లో ఉండేవారిని 'కేరళ ప్రభుత్వ వైద్యులు'గా గుర్తింపునిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం వైద్యుల సేవలకు అరుదైన గౌరవం కల్పిస్తోంది.

అయ్యప్ప సేవలో తరించడం గొప్ప అదృష్టం..

పవిత్ర పుణ్యక్షేత్రమైన శబరిమలలో అయ్యప్ప భక్తులకు వైద్యసేవలు అందించే అవకాశం కలగడం తమ అదృష్టంగా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. డిసెంబరు 1 నుంచి 5 రోజుల పాటు శబరిమల, పంబలో వైద్యసేవలు అందించేందుకు వెడుతున్న సందర్భంగా ఆయన శుక్రవారం గుంటూరులో విలేకరులతో మాట్లాడారు. తనతో ఆరుగురు వైద్య బృందం శబరిమల, పంబల్లో సేవలు అందించేందుకు వెడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో శబరిమలవెళ్లే వైద్య బృందంలో సభ్యులైన డాక్టర్ మోపర్తి శ్రీనివాస్ (విజయవాడ), లావు సతీష్ (చిలకలూరి పేట), డాక్టర్ శ్రీనివాసరెడ్డి (గుంటూరు) పాల్గొన్నారు.



శరవేగంగా హైవే నిర్మాణం

పిడుగురాళ్ల నుంచి వాడరేవుకు హైవే రోడ్డు ఏర్పాటు

పర్చూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో 167ఏ జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పిడుగురాళ్ల నుంచి వాడరేవు వరకు దాదాపు 82 కిలోమీటర్ల మేర హైవే నిర్మాణం చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారు. అందులో భాగంగా పర్చూరును అనుసంధానిస్తూ కారంచేడు మీదుగా వాడరేవు వరకు హైవే రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పర్చూరు-కారంచేడు మధ్య పనులు చకచకా సాగుతున్నాయి. రోడ్డు నిర్మాణంతోపాటు కల్వర్టులు, ఫ్లైఓవర్ ఏర్పాటుకు సంబంధించిన పనులు చేపట్టారు. పర్చూరు వైజంక్షన్‌లో ఫ్లైఓవర్‌ను నిర్మించే విధంగా ప్రతిపాదించారు. ప్రస్తుతం ఆ కూడలిలో ఫ్లైఓవర్ పనులు చేపట్టారు. హైవే నిర్మాణంతో తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రవాణాకు సులువు కానుంది. అంతేగాక వాడరేవు ఉండటం వల్ల పర్యాటక రంగం కూడా అభివృద్ధి చెందనుంది. అదేవిధంగా వాణిజ్య వ్యాపార రంగం అభివృద్ధికి హైవే నిర్మాణం ఎంతగానో దోహదపడనుంది. ఇప్పటికే వాడరేవు-పిడుగురాళ్ల రహదారి నిర్మాణపు పనులతో పర్చూరు ప్రాంతం రూపురేఖలు మారనున్నాయి.

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కాసేపు అరుపులు, చమత్కారాలతో ముగింపు

ఒక్క అంశంపై గంట సేపు రసాబాసా

ఇదీ చీరాల మున్సిపల్ సర్వసభ్య సమావేశం తీరు

చీరాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : చీరాల మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు అరుపులు, కేకలకే ప్రాధాన్యత ఇచ్చారు. కాసేపు కేకలు, కాసేపు చమత్కారాలతో సభ హుందాతనాన్ని తగ్గించారు. అజెండాలోని 15వ అంశంలో పొందుపరిచిన 29వ వార్డులోని ఓ డ్రెయిన్ నిర్మాణానికి సంబంధించిన చిన్న అంశంపై సుమారు గంటసేపు పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు మధ్య రచ్చనడవడం గమనార్హం.

కమిషనర్ గారు.. మీరు రాజకీయ నాయకునిగా వ్యవహరించొద్దు

పట్టణంలో పలువురి విగ్రహాలకు ఏర్పాటుకు సంబంధించి చర్చ జరిగే సమయంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ కమిషనర్ గారు.. మీరు రాజకీయ నాయకుడిగా వ్యవహరించొద్దు.. పార్టీలు వేరైనా ఎవరి ప్రాధాన్యత వారికి ఉంటుంది.. ఎమ్మెల్యే సూచనలను తీసుకోండి.. అలాగే మాజీ మంత్రి పాలేటి రామారావు ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ఇచ్చిన అర్జీని అజెండాలో ఎందుకు పొందుపరచలేదు..? అబ్దుల్ కలాం, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు సంబంధించి నిర్దిష్టంగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేదా అంటూ ఆక్షేపించారు. దీనిపై కమిషనర్ అబ్దుల్‌రషీద్ స్పందిస్తూ తనపై ఆరోపణలు చేయవద్దని, అన్ని విషయాలు మీ దృష్టికి తీసుకొచ్చే నిర్ణయం తీసుకుంటున్నామని చెప్పారు. వాటికి సంబంధించి అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకుని నిర్ణయం తీసుకుందామని కౌన్సిలర్ల వాద, ప్రతివాదనల అనంతరం ఒక అంగీకారానికి వచ్చారు.

నేను చైర్మన్‌ని.. నువ్వు కౌన్సిలర్‌వి...

ప్రధానంగా 15వ అంశానికి సంబంధించి చర్చ సమయంలో కౌన్సిలర్ సత్యానందం, ఇతర కౌన్సిలర్లలో పలువురు పెద్ద, పెద్దగా మాట్లాడటంతో ఒకరి తరువాత ఒకరు మాట్లాడాలని చైర్మన్ చెప్పారు. ఆ క్రమంలో నేను లేస్తూనే ఉంటా.. మాట్లాడతానే ఉంటానంటూ సత్యానందం బిగ్గరగా చెప్పారు. నువ్వు లేస్తూనే ఉంటావు.. నేను కూర్చోవాలరి అంటూనే ఉంటా.. నువ్వు కౌన్సిలర్‌వి, నేను చైర్మన్‌ను ఆ విషయం గుర్తుంచుకోవాలని జంజనం చెప్పారు.



ఆరు అంగుళాల్లో డ్రెయిన్ కడతారా..

29వ వార్డులో డ్రెయిన్ నిర్మాణానికి సంబంధించి ఆ వార్డు కౌన్సిలర్ బత్తుల అనీల్ మాట్లాడుతూ ఆ ప్రాంతంలో ఉన్న మున్సిపల్ ప్లాన్ ప్రకారం అక్కడ రోడ్డు వెడల్పు 13.6 అడుగులు ఉందన్నారు. అందులో 13 అడుగుల రోడ్డు వేశారు. మిగిలిన ఆరు అంగుళాల్లో డ్రెయిన్ ఎలా కడతారని ప్రశ్నించారు. అక్కడ దశాబ్దాలుగా వివాదం నడుస్తోందన్నారు. పలు నిధులకు సంబంధించి కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, గుంటూరు ప్రభాకరరావు తదితరులు లేవనెత్తిన సమస్యలకు టీపీపీ శ్రీనివాసులు, డీఈ, కమిషనర్‌లు వివరణ ఇచ్చారు. అజెండాలోని మొత్తం అంశాలు 18 కాగా అందులో 4 అంశాలను వాయిదా వేశారు. 13 అంశాలను కొద్దిపాటి చర్చతో ఆమోదించారు. మంచినీటి కుళాయి పన్ను పెంపును అందరూ వ్యతిరేకించారు. ఆ అంశాన్ని పాత పద్ధతిలో యధాతథంగా కొనసాగించాలని సవరిస్తూ ఆమోదించారు.

ఒంగోలులో రెండు రైళ్ల నిలుపుదల

ఒంగోలు కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి విజ్ఞప్తి మేరకు 02121, 02122 జబల్పూర్- మధురై ఎక్స్‌ప్రెస్, 04717, 04718 తిరుపతి- జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఒంగోలులో నిలుపుదల చేస్తారు.

ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయాభివృద్ధి

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతోనే వ్యవసాయాభివృద్ధి సాధ్యం అని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి చెప్పారు. మండలంలోని బొమ్మనంపాడు రైతు సేవా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లడారు. రసాయన పురుగు మందులు ఎక్కువగా వాడడం వలన ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు భూమి చౌడుబారుతుందని, భూమిలో సేంద్రియ కర్బనం పెరగాలంటే పచ్చిరొట్ట వేసి భూమిలో కలియదున్నాలన్నారు. విత్తనశుద్ధి కచ్చితంగా చేసుకోవాలని ఏడీఏ ధనరాజ్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ, వీఏఏ ఆజాద్, మోటుపల్లి నాగేశ్వరరావు, కామేపల్లి హనుమంతరావు, నాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొల్లపాలెంలో నేత్రదానం

ఇంకొల్లు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లపాలెంలో శుక్రవారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన వెనిగండ్ల సుశీలమ్మ మృతి చెందగా ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి వైద్యశాల డాక్టర్లు.. మృతురాలి నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబసభ్యులు హనుమంతరావు, వెంకట్రావు, చంద్రశేఖర్‌లను కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామిలు అభినందించారు.

ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1 అంతర్జాతీయ ఎ యిడ్స్ దినం సందర్భంగా శుక్రవారం అద్దంకి పట్టణంలోని గుర్రాల కాలనీ, పసుమర్తిపాలెంలో జిల్లా హెచ్‌ఐవి, ఎ యిడ్స్ నిర్మూలన సంస్థ, హెల్త్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలు, కిషోర బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వ్యాధి వ్యాప్తి చెందకుండా గ్రామాలల్లో వివిధ కార్యక్రమాల ద్వారా అ వగాహన కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కర్‌లు కరుణ, శ్రావణి, మల్లేశ్వరి, శి వ పార్వతి తదితరులు పాల్గొని నిర్వహించారు.

ప్రసన్నాంజనేయ సన్నిధిలో కార్తీక దీపోత్సవం



కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : శింగరకొండలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శుకవారం సాయంత్రం కార్తీక మాసం సందర్భంగా కార్తీక దీపోత్సవం నిర్వహించారు. లక్కవరం స్వామిజీచే జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ దీపోత్సవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపారాధన చేసుకున్నారు.

జాబ్ మేళాలో 21 మంది ఉద్యోగాలకు ఎంపిక



మాట్లాడుతున్న అధికారులు

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 41 మంది అభ్యర్థులు రాగా వారిలో 21 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందారని జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి పి. ప్రణయ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సాహిల్‌బాబు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ గోపినాథ్, శ్రీకాంత్, వినోద్ పాల్గొన్నారు.

రీసర్వే సంకటం

ఆయా గ్రామాల్లో వేధిస్తున్న సమస్యలు

మూడేళ్లుగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్‌లు

క్రయవిక్రయాలు నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్న గ్రామస్థులు

పథకాలకు దూరమవుతున్న రైతులు

బ్యాంకుల్లో రుణాలు కూడా పొందలేని దుస్థితి

గ్రామసభలు నిర్వహించినా పరిష్కారం శూన్యం



ఈ రైతు పేరు రాయ ఈశ్వరరెడ్డి. తర్లుపాడు మండలం కారుమానుపల్లి గ్రామం. ఈయనకు వారసత్వంగా రెండెకరాలు వచ్చింది. ఈ భూమిలో మూడేళ్లుగా మిరప సాగు చేశారు. కాలం కలిసి రాకపోవడంతో రూ.2లక్షల మేర నష్టపోయారు. అప్పులు తీర్చేందుకు పొలం అమ్ముదామని ప్రయత్నిస్తే ఎవరూ కొనడం లేదు. రీసర్వే జరిగిన గ్రామం కావడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. అటు పొలం అమ్ముకోలేక, ఇటు అప్పులు తీర్చలేక తీవ్ర మనోవేదనలో కొట్టుమిట్టాడుతున్నారు.



పేరు పిన్నిక శ్రీనివాసులు. మార్కాపురం మండలం శివరాంపురంలో ఈయనకు 2.10 ఎకరాల పొలం ఉంది. ఆ గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా తొలుత రీసర్వే చేశారు. ఆయన పొలం పక్కనే ఉన్న బంధువులకు చెందిన ఎకరం భూమిని రెండేళ్ల క్రితం కొన్నాడు. రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి కార్యాలయానికి వెళ్తే చుక్కెదురైంది. మీ గ్రామంలోని భూములు ఆన్‌లైన్‌లో చూపడం లేదు కాబట్టి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కష్టమని అధికారులు చెప్పారు. కొన్న భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోలేక శ్రీనివాసులు అవస్థలు పడుతున్నారు.

- ఇదీ జిల్లాలో రీసర్వే చేసిన గ్రామాల్లో పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూముల రీసర్వే ప్రక్రియ నేడు ప్రజలకు శాపంగా మారింది. నాలుగు ఫేజ్‌లలో నిర్వహించిన ఈ కార్యక్రమంతో రైతుల కష్టాలు తీరకపోగా పలు నూతన సమస్యలు తీసుకొచ్చింది. మూడు సంవత్సరాల నుంచి ఇంకా ఆ సమస్యలన్నీ అపరిష్కృతంగానే ఉన్నాయి. ఏ మాత్రం తేడా ఉన్నా ఆయా భూములు ఆన్‌లైన్ కనిపించడం లేదు. దీంతో రిజిస్ట్రేషన్లు కావడం లేదు. అలాగే పథకాలకు ఇబ్బందిగా మారింది. రుణాలు అందడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

మార్కాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రీసర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో రైతులకు కొత్త కష్టాలు వచ్చిపడ్డాయి. ఆ కార్యక్రమంతో భూములపై పారదర్శకత వస్తుందని, వివాదాలు సమసిపోతాయని గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు హడావుడి చేయగా, వాస్తవంలో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. అంతా అస్తవ్యస్తంగా తయారైంది. ఏమీ చేయలేక అధికారులు ఆన్‌లైన్ నిలిపివేశారు. దాంతో భూముల క్రయవిక్రయాలు జరగక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూములు అమ్ముకోవాలనే వాళ్లు, ఇప్పటికే అమ్ముకున్న వాళ్ల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోవడంతో అవస్థల పాలయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని సడలింపులు ఇచ్చి రీసర్వే జరిగిన గ్రామాల్లో రిజిస్ట్రేషన్లకు అనుమతులిచ్చింది. కొద్దిరోజులపాటు మాత్రమే రిజిస్ట్రేషన్లు చేశారు. అయితే ఇతర జిల్లాల్లో యథావిధిగానే జరుగుతున్నా, రెండు మాసాల నుంచి మన జిల్లాలో మాత్రం రిజిస్ట్రేషన్లు నిలిపేశారు. పలు రకాలైన సాంకేతిక కారణాలను చూపి ఆ శాఖాధికారులు క్రయవిక్రయదారులకు మొండిచేయి చూపుతున్నారు. దీంతో జిల్లాలో రీసర్వే జరిగిన గ్రామాల్లోని ప్రజలు లబోదిబోమంటున్నారు.

ఎల్‌పీ నంబర్లపై నిలిచిన రిజిస్ట్రేషన్‌లు

రీసర్వే జరిగిన గ్రామాల్లో సర్వే నంబర్ల బదులు నూతనంగా ఎల్‌పీ(ల్యాండ్ పార్శిల్) నంబర్‌ను గత ప్రభుత్వం ఆన్‌లైన్‌లలో ఉంచింది. ఈ నూతన ప్రక్రియతో పలు రకాలైన చిక్కులు ఏర్పడ్డాయి. ఒక సర్వే నంబర్‌లో పలు సబ్ డివిజన్‌లు ఉన్నా చాలా చోట్ల అన్నింటికి కలిపి ఒకే ఎల్‌పీ నంబర్ కేటాయించారు. అందులో ఒకరు భూమి అమ్ముకోవాలన్నా, అందరి భూవిస్తీర్ణం చూపుతుంది. దీంతో రిజిస్ట్రేషన్ల సమయంలో అయోమయ పరిస్థితులు తలెత్తుతున్నాయి. గతంలో మాదిరి సర్వే నంబర్లపై రిజిస్ట్రేషన్‌లు చేయాలంటే వెబ్‌ల్యాండ్‌లో నిషేధిత భూముల జాబితాలో ఆయా నంబర్లను చూపుతున్నారు. దీంతో ఏ సమస్య లేని భూముల్లో కూడా రిజిస్ట్రేషన్లు చేయడం కుదరడం లేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత ఎల్‌పీ నంబర్ నమోదు చేస్తే రిజెక్ట్ చేస్తోంది. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు ఎవరూ చొరవ చూపకపోవడంతో రీసర్వే గ్రామాల్లోని ప్రజలు ఏం చేయాలో తెలియక తీవ్ర ఆవేదనకు గురికావాల్సి వస్తోంది.

బ్యాంకుల్లో రుణాలకు చుక్కెదురు

రీసర్వే గ్రామాల ప్రజలు భూమి తనఖా పెట్టి బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాలన్నా కుదరడం లేదు. బ్యాంకులో రుణం పొందాలంటే పట్టాదారు పాస్‌బుక్‌తోపాటు 1బీ, అడంగల్ తప్పనిసరి. పాస్‌బుక్ ఉన్నా వెబ్‌ల్యాండ్ నుంచి 1బీ, అడంగల్‌లు రావడం లేదు. చివరికి కొందరు బ్యాంకర్లు చొరవ తీసుకుని తహసీల్దార్ నుంచి మాన్యువల్‌గా తెచ్చుకోండి రుణాలిస్తామన్నా.. రెవెన్యూ అధికారులు అందుకు సహకరించడం లేదు. అంతేకాక ఇప్పటికే రుణాలు తీసుకొని ఉన్న రైతులు కూడా పలు రకాలైన అవస్థలు పడుతున్నారు. ప్రతి సంవత్సరం రైతులు వడ్డీ చెల్లించి రుణాలను రీషెడ్యూల్ చేసుకునే వెసులుబాటు ఉంది. కానీ ఎప్పటికప్పుడు 1బీ, అడంగల్‌లు బ్యాంకుకు సమర్పించాలి. అక్కడ వెబ్‌ల్యాండ్ నుంచి అవి రాకపోవడంతో రుణాలను రీషెడ్యూల్ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో చాలామంది ఏళ్లుగా తీసుకున్న రుణాలకు వడ్డీలు కూడా చెల్లించకపోవడంతో డిఫాల్టర్ల జాబితాలో చేరుతున్నారు.

గ్రామసభలు పెట్టినా ఫలితం శూన్యమే

రీసర్వే చేసిన గ్రామాల్లో ఎక్కువగా తప్పులు దొర్లాయి. ప్రజల నుంచి ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఎక్కువసంఖ్యలో ఫిర్యాదులు అందాయి. దీంతో నూతన ప్రభుత్వం గత నెలలో గ్రామసభలు నిర్వహించి అర్జీలు స్వీకరించింది. ప్రతి గ్రామంలోనూ సుమారు 80శాతం మేర తప్పులు దొర్లాయని వాటిని సరిచేయాలని ప్రజలు అర్జీలు అందజేశారు. అంతవరకు బాగానే ఉన్నా తప్పులను సరిచేయడానికి వెబ్ ల్యాండ్ సైట్ ఓపెన్ కావడం లేదు. తహసీల్దార్‌లకు లాగిన్ ఇవ్వకపోవడంతో అర్జీలను పరిష్కరించలేని దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టిసారించి రీసర్వే జరిగిన గ్రామాల ప్రజల కష్టాలను పరిష్కరించాలని కోరుతున్నారు.

కరెంట్‌కూ.. రీచార్జి

(5వ పేజీ తరువాయి...)

అందులో తమ సర్వీసు నంబరును నమోదు చేసుకుని కట్టవచ్చు. ఎప్పటికప్పుడు యాప్ ద్వారా తమకున్న విద్యుత్ సర్వీసుకు రీచార్జి చేసుకునే సౌకర్యం ఉంటుంది. దీనివల్ల అపరాధ రుసుం చెల్లించే పరిస్థితి ఉండదు. మీటర్ రీడింగ్ తీసే సమయంలో తప్పులు దొర్లే పరిస్థితి ఉండదు. స్మార్ట్ మీటర్‌లో ఏర్పాటు చేసిన ఇన్ బిల్ట్ సిమ్ ద్వారా ఎప్పటికప్పుడు మీటర్‌లో రికార్డు అయ్యే మొత్తం సమాచారం ఆన్‌లైన్ ద్వారా చూసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో మూడు జిల్లాల్లో లక్ష్యాల మేర మీటర్ల ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. వ్యవసాయం మినహా అన్ని కేటగిరి సర్వీసులకు మీటర్లు బిగింపు తప్పని సరి చేస్తున్నారు.

వినియోగదారులకు అవగాహన

విద్యుత్ వినియోగం 200 యూనిట్లకుపైగా ఉన్న గృహ వినియోగదారులందరికీ స్మార్ట్ మీటర్లను బిగించనున్నారు. వ్యాపార, వాణిజ్య, పరిశ్రమలకు పూర్తయిన వెంటనే గృహాలకు మీటర్ల బిగింపునకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. మీటర్ల బిగింపు పూర్తయితే వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. స్మార్ట్ మీటర్ల వల్ల నష్టాలు.. అధిక బిల్లు తదితరాలపై వినియోగదారులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వచ్చే జూలై నుంచి స్మార్ట్ మీటర్లు వినియోగంలోకి రానున్నాయి. అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న విధానంలోనే విద్యుత్ బిల్లులు చెల్లించాలని అధికారులు తెలిపారు. స్మార్ట్ మీటర్ బిగించినా దానిని యాక్టివేట్ చేయలేదని చెబుతున్నారు. మీటర్ల ఏర్పాటు పూర్తయిన వెనువెంటనే రీచార్జి విధానం అమల్లోకి రానున్నది.

విద్యుత్ చోరీకి చెక్

విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ద్వారా విద్యుత్ చౌర్యం కూడా తెలిసిపోతుంది. ఎక్కడ విద్యుత్‌చౌర్యం జరుగుతుందో గుర్తించే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. 11 కేవీ, 33 కేవీ ఫీడర్లు, అధిక సామర్థ్యం గత నియంత్రికల వద్ద స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం వల్ల ఎంత విద్యుత్ సరఫరా అవుతోంది, వినియోగం, వృథా ఎంత వంటి వివరాలు ఆయా మీటర్లలో ఉన్న సిమ్‌లలో నమోదవుతుంది. ఫీడర్ నియంత్రికలపై హెచ్చు, తగ్గుల సరఫరా అవుతున్నా యాప్‌లో నమోదు అవుతుంది.

రూ.100 కోట్లతో పాలేరు, ముసిలో మేట తొలగింపు

మారిటైం బోర్డుకు ప్రతిపాదనలు

కోరిన చైర్మన్ దామచర్ల సత్య

పలు అంశాలపై కలెక్టర్, ఇతర అధికారులతో చర్చ



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మారిటైం బోర్డు చైర్మన్ సత్య

ఒంగోలు, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాలేరు, ముసి నదులు సముద్రంలో కలిసే ప్రాంతంలో భారీగా మేట వేసిన ఇసుకను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య నారాయణ(సత్య) జిల్లా యంత్రాంగాన్ని కోరారు. అందుకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలను మారిటైం బోర్డుకు పంపాలని సూచించారు. జిల్లాలో ఆక్వా సాగు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, ఫిషింగ్ హార్బర్ తదితర మారిటైం బోర్డు పరిధిలోని అంశాలతో పాటు పాలేరు, ముసి నదులలో ఇసుక మేటల తొలగింపు ప్రాధాన్యతలపై శుక్రవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, మత్స్య శాఖ ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి ఇతర అధికారులతో కలిసి చర్చించారు. పాలేరు, ముసిలలో ఇసుక మేటలతో సముద్రం నీరు వాగులోకి ఎదురు రాక ఆ ప్రాంతంలోని ఆక్వా సాగుదారులు ఇబ్బందిపడుతున్నారని, అలాగే ఎగువ నుంచి వచ్చే సమయంలో ప్రవాహం అధికంగా వచ్చినపుడు పరిసర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. అందువల్ల ఇసుక మేటలు తొలగింపు అవసరాన్ని గుర్తించి ప్రతిపాదించాలని కోరారు. ప్రాథమికంగా ఇందుకోసం రూ.100 కోట్లు అవసరమయ్యే అవకాశం ఉందన్న విషయం చర్చ రాగా ఆ మేరకు మారిటైం బోర్డుకు ప్రతిపాదనలు పంపితే నిధులు కల్పనకు కృషిచేస్తామన్నారు. అలాగే పాకలలో రూ.5కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలపై సమీక్ష చేశారు. కొత్తపట్నం సమీపంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అందుకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా జిల్లాలో ఆక్వాసాగు అభివృద్ధి తద్వారా ఉపాధి కల్పన అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఆ రంగం మరింత అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన పంట ఉత్పత్తులపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు.

జిల్లాపై తుఫాన్ ప్రభావం

పలుచోట్ల జల్లులు,

నేడు ఒక మోస్తరు వానలు పడే అవకాశం

ఒంగోలు, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఫంగల్ తుఫాన్ ముప్పు తప్పినప్పటికీ ప్రభావం మాత్రం కనిపిస్తోంది. రెండు, మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు వచ్చి చలి గాలుల తీవ్రత పెరగ్గా శుక్రవారం అధికమయ్యాయి. అదేసమయంలో తుఫాన్ ప్రభావంతో శుక్రవారం సాయంత్రం నుంచి జిల్లాలో ప్రత్యేకించి తూర్పు, దక్షిణ ప్రాంతాలలో జల్లులు ప్రారంభం అయ్యాయి. శనివారం ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కొన్ని చోట్ల పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. నాలుగు రోజుల క్రితమే శ్రీలంక, తమిళనాడుల మధ్య అల్పపీడనం ఏర్పడి క్రమంగా బలపడుతూ తుఫాన్‌గా మారింది. దానికి ఫెంగల్ అని పేరు పెట్టారు. తొలుత చెన్నైకి సమీపంలో ఉత్తర ప్రాంతంలో తుఫానుగా మారి తీరం దాటుతుందని దీనివల్ల జిల్లాలో శుక్రవారం నుంచి మూడు రోజులుపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. తద్వారా జిల్లాపై ఫెంగల్ ముప్పు ఉంటుందని భావించారు. అయితే తుఫాన్ దిశ మారడంతో జిల్లాకు ముప్పు తప్పిందని శుక్రవారం సాయంత్రం ఆరుగంటలకు చెన్నైకి ఆగ్నేయంగా 38కి.మీ దూరంలో ఉంది. శనివారం మధ్యాహ్నాంకు తమిళనాడులోని కరైకల్- మహాబలిపురం ప్రాంతాల మధ్య తీరం దాటే అవకాశం ఉండగా రాష్ట్రంలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాలపై అధిక ప్రభావం చూపనుంది.

ప్రారంభమైన జల్లులు

ఒక రకంగా జిల్లాకు ఫెంగల్ తుఫాన్ ముప్పు తప్పిపోగా శుక్రవారం సాయంత్రం నుంచి జిల్లాలో వర్షం ప్రారంభమైంది. ఒంగోలు, కొండపి, ఎస్ఎన్ పాడు నియోజకవర్గాలతో పాటు కనిగిరి నియోజకవర్గంలోని కొన్ని ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి. శనివారం ఒక మోస్తరు వానలే పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సమాచారం. అయితే వర్షం కొన్ని ప్రాంతాలలో అవసరం కాగా కొద్దిపాటిగా పడితే ఉపయోగమేకాని ఎక్కువగా కురిస్తే మాత్రం తీవ్రగా నష్టపోతామని రైతులు చెప్తున్నారు భారీ వర్షం పడితే ఇటీవల వేసిన పొగాకు, శనగ దెబ్బతినే అవకాశంతో పాటు తూర్పు ప్రాంతంలో ఆ పంటలు సాగు మరింత ఆలస్యం అవుతుంది.

పెరిగిన చలి తీవ్రత

ఇదిలా ఉండగా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోయాయి. తెల్లవారు జాము నుంచి చలి అధికంగా ఉంటుండగా తూర్పు దక్షణ ప్రాంతంలో పగటిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గి మబ్బులు కమ్మి చలిగాలులు వీస్తున్నాయి. అదేసమయంలో పొలంలో ఉన్న పంటలపై తెగుళ్ల దాడి పెరిగిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మిర్చి, మొక్కజొన్న, వరి, పొగాకు వంటి పంటలపై తెగుళ్ల తీవ్రత పెరిగింది. పూతకు వచ్చిన కంది పంటపై కూడా పలు ప్రాంతాలలో పురుగు తాకిడి పెరిగినట్లు చెప్తున్నారు. మొత్తం మీద పంటలపై వర్షాల కన్నా చలి వాతావరణం ప్రభావం అధికంగా కనిపిస్తోంది.

ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులుగా నియామకం

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లను జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రవ్యాప్తంగా పలువురు డిప్యూటీ కలెక్టర్లకు శుక్రవారం ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా జే.పార్థసారధిని నియమించింది. అలాగే మరో డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన కే. ఆదెయ్యను హెచ్ అండ్ ఎఫ్ డబ్ల్యూ జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమించింది.

దైవాలరావూరులో వైభవంగా ఏకాహం

మేదరమెట్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు శ్రీహరసాయి హనుమత్ క్షేత్రంలోని ఉమామహేశ్వర ఆలయంలో 24గంటలపాటు(ఏకాహం) శివనామస్మరణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం శుక్రవారం వేకువజాము నుంచి ఆలయ పూజారి రాజశేఖరశర్మ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారు అర్ధనారీశ్వర అలంకారంలో భక్తుల పూజలందుకున్నారు. సాయంత్రం కోటి దీపోత్సవంతో పాటు అఖండ కర్పూర దీపారాధన(11కేజీలు) నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



అర్ధనారీశ్వర అలంకారంలో ఉమామహేశ్వరస్వామి

అద్దంకిలో నేడు...

అద్దంకి మున్సిపల్ కౌన్సిల్ హాల్ నందు శనివారం ఉదయం 11 గంటలకు చైర్మన్ ఎల్. ఏస్తేరమ్మ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమీషన్ డి. రవీంద్ర తెలిపారు. కావున కౌన్సిల్ సభ్యులు అందరు హజరు కావాలని కోరారు.

ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అద్దంకి డిపో కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ప్రతిభామూర్తులు-మధురస్మృతులు కార్యక్రమం జరుగుతుందని బాధ్యులు వీసీహెచ్ కోటయ్య తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఏ నెలలో అయినా 1వ తేదీ సెలవు రోజు అయితే ఎన్‌టీఆర్ రైతు భరోసా పింఛన్ ముందు నెల చివరి రోజున పంపిణీ చేస్తామని, డిసెంబరు 1వ తేదీ ఆదివారం వచ్చినందున పింఛన్‌లు నవంబరు 30వ తేదీ పంపిణీ చేస్తామని, లబ్ధిదారులు అందుబాటులో ఉండి పింఛన్ సొమ్ము పొందాలని మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర తెలిపారు. -అద్దంకిటౌన్

గోశాలకు ట్రాక్టర్ వరి గడ్డి అందజేత



గడ్డిని అందజేస్తున్న క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అద్దంకిలోని గోశాలకు టాక్టర్ వరి గడ్డిని శుక్రవారం అందజేశారు. విశ్రాంత వ్యాయమ ఉపాధ్యాయుడు నాగయ్య, రోటరీ క్లబ్ సభ్యుల సహకారంతో అద్దంకిలోని హరిహర గోశాలకు ఒక ట్రాక్టర్ వరి గడ్డిని అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ మురళీసుధాకరరావు, ట్రెజరర్ శ్రీనివాసరావు, ఆంజనేయులు, గాడేపల్లి దివాకర్‌దత్తు పాల్గొన్నారు.

చిదంబరేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

చినగంజాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : స్థానిక గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి ఆలయంలో స్వామికి లక్ష బిల్వార్చనతో శుక్రవారం పూజలు నిర్వహించారు. కార్తీక మాసశివరాత్రి సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో ఆలయంలోని చిదంబరేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. తదనంతరం లక్ష బిల్వార్చన(మారేడు దళాలు) పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ట్రాఫిక్ సమస్య.. పరిష్కారపు అడుగులు



మార్కెట్ సెంటర్లో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

చీరాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వన్‌టౌన్ సీఐ మారీదు శ్రీనివాసరావు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నిత్యం రద్దీగా ఉంటే ప్రాంతాలను ఎంచుకుని పరిష్కార చర్యలు తీసుకున్నారు. మార్కెట్ సెంటర్లో పండ్లు, పూల వ్యాపారుల దుకాణాలను ఒక క్రమపద్ధతిలో పెట్టించారు. రోడ్డు మధ్యలో ఓ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయించారు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ చెప్పినట్లైంది. ఎల్‌ఐసీ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం వద్ద రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు బస్సుల పార్కింగ్‌కు సంబంధించి కొన్ని నిర్దిష్ట సూచనలు చేశారు. ఇదే క్రమంలో పట్టణంలోని ఇతర జనసమర్ధ ప్రదేశాల్లో ట్రాఫిక్ సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బాలికపై అత్యాచారయత్నం

చినగంజాం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మూడేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేసిన 60 ఏళ్ల వ్యక్తిపై చినగంజాం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శీలం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఒక గ్రామానికి చెందిన మూడేళ్ల బాలిక ఇంటి ముందు ఆడుతుండగా, అదే గ్రామానికి చెందిన వ్యక్తి వారి ఇళ్లకు సమీపంలోని జొన్న పంటలోకి ఈ నెల 26వ తేదీ ఉదయం ఆ బాలికను తీసుకొని వెళ్లాడు. అతను అత్యాచారయత్నం చేయబోతుండగా బాలిక కేకలు వేయడంతో అటుగా ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలు కేకలు విని రావడంతో అతను పారిపోయాడు. ఉపాధి హామీ కూలీలు బాలికను వాళ్ల ఇంటి దగ్గర విడిచిపెట్టారు. బాలిక తల్లిదండ్రులు గురువారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శుక్రవారం తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

డ్రైనేజ, తాగునీటి సమస్యలు పరిష్కరించండి

కొరిశపాడులోని ప్రజావేదిక కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి



మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

మేదరమెట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం అని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాలుగు నెలల పాలనలో రాష్ట్రానికి 60 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. అప్పులు చేయడం తప్ప సంపద సృష్టించడం చేతకాని జగన్‌రెడ్డి ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయినా, ఇప్పటికీ అబద్దాలతో ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారన్నారు. కొరిశపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజి, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి పంచాయతీ నిధులను ఉపయోగించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు ప్రతి నెల క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పింఛన్ వెయ్యి రూపాయలు పెంచడం, అన్న క్యాంటిన్‌లు తెరవడం, దీపం పథకం కింద 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందించడం, రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడం చేస్తున్నామన్నారు. తాగునీటి స్కీమ్‌ల నిర్వహణకు 40శాతం లెస్ టెండర్లు వేస్తున్నారని, పనులు నాణ్యతతో చేస్తేనే బిల్లులు చెల్లించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావును ఆదేశించారు. పలుగ్రామాలకు చెందిన రైతులు రీసర్వేలో తమ భూమి తమ పేరుతో లేకుండా పోయిందని ఫిర్యాదు చేశారు. రీసర్వే కారణంగా వచ్చిన సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కారించాలని తహసీల్దార్ సుబ్బారెడ్డిని ఆదేశించారు. గ్రామాల్లో లోవోల్టేజి సమస్య తలెత్తకుండా అవసరమైనన్ని ట్రాన్స్‌ఫార్మర్లను బిగించాలని ఈఈ మస్తాన్‌రావుకు చెప్పారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, ఎంపీపీ సాదినేని ప్రసన్నకుమారి, జడ్పీటీసీ సభ్యుడు తుళ్లూరి వెంకట రమణ, ఎంపీడీవో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



రుద్రాంశ సంభూతుడుగా అంజన్న

అంజన్నకు రుద్రాంశసంభూతుడు అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. కార్తీక మాసం మాసశివరాత్రి సందర్భంగా శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని రుద్రాక్షమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. - అద్దంకి టౌన్

3 క్వింటాళ్ల కర్పూరంతో అఖండజ్యోతి

శివనామస్మరణతో మారుమోగిన దుర్గామల్లీశ్వరి దేవస్థానం ప్రాంగణం

భక్తులు భారీగా రాక

మార్టూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఓం నమశ్శివాయ, శంభోశంకర, హరహర మహాదేవ శంభోశంకర అంటూ భక్తుల నినాదాలతో శుక్రవారం రాత్రి జాతీయరహదారి పక్కన శ్రీదుర్గామల్లీశ్వరి దేవస్థానం ప్రాంగణం మారుమోగింది. కార్తీకమాసంలో ఏటా ఈ దేవస్థానంలో భారీగా కర్పూరంతో భక్తులు అఖండ కర్పూరజ్యోతిని వెలిగిస్తారు. అఖండ కర్పూరజ్యోతిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు పత్తిపాటి సురేష్ ఆధ్వర్యంలో 3 క్వింటాళ్ల కర్పూరంతో అఖండ కర్పూరజ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమానికి తొలుత బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన 2 క్వింటాళ్ల బంతి, చామంతి, మల్లి, లిల్లీ తదితర పూలతో దేవస్థానం ప్రాంగణంలో స్వామి రూపాలను, వేంకటేశ్వర స్వామి శంకుచక్రం రూపంలో అందంగా అలంకరించారు. అదేవిధంగా దేవస్థానంలో స్వామిని, అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం వెలిగించిన అఖండ కర్పూరజ్యోతిని భక్తులు తనవితీరా దర్శించుకొని నమస్కారాలు చేసుకున్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీఐ శేషగిరిరావు బందోబస్తు ఏర్పాటుచేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. మాలధారులకు భిక్షను ఏర్పాటు చేశారు.



దేవస్థానం వద్దపూలతో అలంకరణ



దేవస్థానం ఆవరణలో వెలిగించిన అఖండ కర్పూరజ్యోతి

మరుగుదొడ్ల ప్రాధాన్యతను గుర్తించండి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి

పంగులూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మరుగుదొడ్ల ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఎంపీడీవో స్వరూపారాణి చెప్పారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పంగులూరులో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఎంపీడీవో ప్రారంభించారు. బహిరంగ ప్రదేశాలలో మల మూత్రవిసర్జన వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలో మరుగుదొడ్లను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య, పంచాయితీ కార్యదర్శి రాంబాబు పాల్గొన్నారు.

రాజుపాలెంలో పెరిగిన కుక్కల బెడద



వీధులలో ఊరకుక్కలు

మార్టూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం వీధులలో కుక్కల బెడద ఎక్కువైందని గ్రామస్థులు వాపోతున్నారు. ముఖ్యంగా వారం రోజుల నుంచి గ్రామంలో కుక్కలు సంచారం ఎక్కువగా ఉందని చెబుతున్నారు. రాత్రి సమయాలలో ద్విచక్రవాహనదారులను వెంబడిస్తున్నాయని, నడిచిపోయే వ్యక్తులపై ఎగబడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారని వాపోతున్నారు. గ్రామ పంచాయతీ వారు కుక్కల బెడదను నివారించడానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

హెచ్ఐవీపై అవగాహన కలిగి ఉండాలి

డీఎస్పీ మహ్మద్ మొయిన్

చీరాల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : సమాజంలోని ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ మహ్మద్ మొయిన్ చెప్పారు. డిసెంబర్ 1వ తేదీ అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మహిళా మండలి సమావేశ మందిరంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, ప్రాజెక్టు డైరెక్టర్ బి.వి. సాగర్ అధ్యక్షతన రూరల్, పట్టణ మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్థుల పట్ల వివక్ష చూపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి ప్రోగ్రామ్ మేనేజర్ కె. వెంకట్రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మహ్మద్ మొయిన్

అష్టలక్ష్మి ఆలయంలో సామూహిక వ్రత మహోత్సవం



పూజాకార్యక్రమంలో భక్తులు

పర్చూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా పర్చూరులో రూపుదిద్దుకొంటున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి, అనఘాదత్త స్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీ నిర్వాహకులు పాబోలు సత్యనారాయణ నేతృత్వంలో సామూహిక వ్రతాలు నిర్వహించారు. అందులో భాగంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజాకార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కోటా ప్రసన్న దంపతులు పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పాబోలు లక్ష్మీన్నారాయణ, కొత్తూరి వీరాంజనేయులు, రాజశేఖర్ పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమానికి లగడపాటి శంకర్, కాసా అశోక్ కుమార్ తదితరులు ఆర్థిక సహకారం అందజేశారు.

పశు వైద్యనిపుణులు సోమశేఖర్‌కు సత్కారం



డాక్టరు సోమశేఖర్‌ను సత్కరిస్తున్న రైతుసంఘం ప్రతినిధులు

మార్టూరు, నవంబరు29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొల్లాపల్లి గ్రామ నరసింహస్వామి దేవస్థానంలో ఏడాది క్రితం ఒక ఆవుకు కృత్రిమ గర్భధారణ చేయించడం ద్వారా ఇటీవల ఒంగోలు గిత్త జన్మించింది. ఆవుకు చికిత్స చేసిన డాక్టరు సోమశేఖర్‌ను శుక్రవారం బొల్లాపల్లి గ్రామంలో రైతుసంఘం ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రైతుసంఘం నాయకులు వీరవల్లి కృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా డీఏహెచ్‌వో డాక్టరు వేణుగోపాల్, మార్టూరు ఏహెచ్ ఏడీ డాక్టరు టీవీ నరసింహారావు, పశువైద్యాధికారి మాధవీలత, రైతుసంఘం నాయకులు తలపనేని రామారావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు, బోడెపాటి సూరిబాబులు పాల్గొని సోమశేఖర్ సేవలను కొనియాడారు.

సేంద్రియ ఎరువులను తప్పనిసరిగా వాడండి

మేదరమెట్ల, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శనగ, మినుము సాగు చేసే రైతులు దుక్కిలో సేంద్రియ ఎరువులను తప్పనిసరిగా వాడాలని బాపట్ల జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు టి. రత్నకుమారి చెప్పారు. శుక్రవారం మేదరమెట్లలో రైతులకు శనగ, మినుము సాగు పద్ధతులపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి రత్నకుమారితో పాటు ఏడీఏ కె. ధన్‌రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుక్కిలో సేంద్రియ ఎరువులతో పాటు భాస్వరం వేయడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. సూక్ష్మ పోషకాల లోపాలను కూడా సవరించుకోవచ్చని చెప్పారు. రైతులు అందరూ పంట నమోదు చేయించుకుని, పంటల బీ మా చేసుకోవాలని ఏడీఏ ధన్‌రాజ్ చెప్పారు. పొగాకు బదులు జొన్న, మొక్కజొన్న వంటి అపరాల పంటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, వీఏవోలు శ్రీలేఖ, షరీఫ్, సంతోష్, హసీనా పాల్గొన్నారు.



సాగు పద్ధతులపై మాట్లాడుతున్న రత్నకుమారి

గురుకుల పాఠశాల అభివృద్ధికి సహకరిస్తాం

టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్



చిన్నారులతో కలసి భోజనం చేస్తున్న డాక్టర్ మహేంద్ర

వేటపాలెం(చీరాల), నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : స్థానిక గురుకుల పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ చెప్పారు. గురుకుల పాఠశాల విద్యార్థులతో కలసి తన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయడమేగాక వారితో కలసి భోజనం చేశారు. అనంతరం గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మహేంద్రనాథ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు దోగిపర్తి బాలకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పాఠశాలలో వనభోజనాలు భేష్'



వనభోజనాలు చేస్తున్న విద్యార్థులు

అద్దంకిటౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో వనభోజనాలు కార్యక్రమం మంచి ఆహ్లాదకరంగా ఉంటుందని, విద్యార్థులు ఉపాధ్యాయుల మధ్య సాన్నిహిత్యం పెరుగుతుందని ఎంఈవో బి. సుధాకరరావు చెప్పారు. మండలంలోని బొమ్మనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు అందరూ కలిసి కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం విద్యార్థులతో కలిసి వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో సుధాకరరావు హాజరై ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఇక ముందు కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని హెచ్‌ఎం సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి చెప్పారు. అనంతరం గణిత ఉపాధ్యాయుడు పోతినేని శంకరరావు విద్యార్థుల తాగునీటికి కోసం అవసరమైన వాటర్ బాటిల్స్‌ను అందజేశారు.

ఆధార్ నమోదులో తప్పులు లేకుండా చూసుకోవాలి

బల్లికురవ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : ఆధార్ నమోదులో తప్పులు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో కుసుమకుమారి చెప్పారు. బల్లికురవ మండలం ఉప్పమాగులూరు గ్రామంలోని సచివాలయంలో చేపడుతున్న ఆధార్ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపీడీవో పరిశీలించారు. నూతనంగా ఆధార్ కార్డును ఇచ్చేటప్పుడు పేర్లు తప్పులు లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. గతంలో ఆధార్ కార్డులో ఉన్న తప్పులను సరిదిద్దుకునేందుకు చేసుకున్న దరకాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో కుసుమ కుమారి